జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

రంగారెడ్డి | శుక్రవారం 20 జూన్ 2025 | సంపుటి : 15 | సంచిక : 263 | వెల: రూ.5 | పేజీలు: 08 | RNI NO.APTEL/2010/36516

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పూర్ణిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com






## 15 రోజుల్లోగా ఓటర్ ఐడీ కార్డుల డెలివరీ

- కార్డు(ఎపిక్)ను ఓటర్లకు చేరవేసే విషయంలో ఎన్నికల సంఘం కీలక నిర్ణయం
- ప్రస్తుతం ఈ కార్డుల డెలివరీకి నెల రోజులకుపైగా సమయం
- నూతన ప్రామాణిక నియమావళిని ఎన్నికల సంఘం రూపొందించింది.

# జగన్ హయాంలో ఎన్నో అరాచకాలు



- ప్రజలను ఇబ్బంది పెడతారా..
- గంజాయి, బెట్టింగ్ బ్యాచ్‌లు, రౌడీలకు విగ్రహాలు పెడతారా: సీఎం చంద్రబాబు
- తాము ఎవరినీ టార్గెట్ చేయడం లేదు..
- చట్టం తన పని తాను చేసుకుపోతుందని
- ఏపీ సీఎం చంద్రబాబు స్పష్టం
- కొందరికి క్రైమ్ కూడా అలవాటు అయిపోయింది

**అమరావతి**

మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సత్తెనపల్లి పర్యటన సందర్భంగా అల్లర్లు చోటు చేసుకున్నాయి. ఈ ఘటనపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పందించారు. గురువారం ఏపీ సచివాలయంలో సీఎం చంద్రబాబు మీడియాతో మాట్లాడారు. ఓ వైపు యోగా జరుగుతుంటే.. మరోవైపు వైసీపీ శ్రేణులు రఫ్ఫా రఫ్ఫా అంటున్నారని మండిపడ్డారు. చంపండి.. నరకండి.. అని ఎవరైనా అంటారా అని ప్రశ్నించారు. గంజాయి, బెట్టింగ్ బ్యాచ్‌లు, రౌడీలకు విగ్రహాలు పెడతారా అని నిలదీశారు సీఎం చంద్రబాబు. ఇరుకు వీధుల్లో మీటింగ్‌లు పెట్టి ప్రజలను ఇబ్బంది పెడతారా అని సీఎం చంద్రబాబు అడిగారు. హింసను ప్రోత్సహించి పోలీసులపై నిందలు మోపుతారా అని ఫైర్ అయ్యారు. ఏపీలో ఎప్పుడైనా ఇలాంటి పోకడలు చూశారా అని ప్రశ్నించారు. నేరస్థులతో రాజకీయాలు - మిగతా 3లో



## ఏడాదిలో సాధించిన విజయాలు..

- డిప్యూటీ సీఎం పవన్ ప్రగతి నివేదిక
- ఏడాది క్రితం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీయే కూటమి విజయానికి అండగా నిలిచి, రాష్ట్రాన్ని బానిస సంకెళ్ల నుంచి విముక్తి చేసిన వారికి కృతజ్ఞతలు
- 2019 నుంచి 2024 వరకు రాష్ట్రం నియంతృత్వ పాలకుల పాలనలో నలిగిపోయింది
- రాష్ట్రాన్ని రక్షించేందుకు, ప్రజాస్వామ్య పాలన పునరుద్ధరించేందుకు ప్రధాని మోదీ, సుదీర్ఘ రాజకీయం అనుభవం కలిగిన నాయకుడు, సీఎం చంద్రబాబు సారథ్యంలో పోటీ చేశాం



## ఇంగ్లీషులో మాట్లాడేవారు సిగ్గుపడే రోజులు వస్తాయి

- కేంద్ర మంత్రి అమిత్ షా కీలక వ్యాఖ్యలు
- అటువంటి సమాజం ఏర్పడే రోజులు ఎంతో దూరంలో లేవు
- మన దేశ భాషలే మన సంస్కృతికి రత్నాలు
- మన భాషలే లేకుంటే మనం నిజమైన భారతీయులుగా ఉండలేం.

## దొంగలు ఎక్కడైనా దొంగతనం చేశామని ఒప్పుకొంటారా?



- వైవీ సుబ్బారెడ్డి వద్ద ట్యాప్ అయిన తన ఆడియో ఉంది
- ఇది నిజమో కాదో.. వైవీ సుబ్బారెడ్డి అతని కుటుంబసభ్యుల మీదు ప్రమాణం చేసి నిజం చెప్పాలి
- ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు.
- "కేసీఆర్, జగన్ ఆనాడు నీచ రాజకీయాలు చేశారు. అందులో భాగంగానే ఫోన్ ట్యాపింగ్ చేశారు.



## ఐటీ ఉద్యోగుల నెత్తిన మరో పిడుగు?!

- త్వరలో ఐటీ రంగంలో పనిగంటలు పెరుగుతున్నట్లు తెలుస్తోంది
- ఆ దిశగా సిలికాన్ వ్యాలీ ఆఫ్ ఇండియా బెంగళూరులో తొలి అడుగు
- ఐటీ సెక్టార్‌లో పని గంటలను పెంచే యోచనలో కర్ణాటక ప్రభుత్వం?

## ఏడాదికే తీవ్ర వ్యతిరేకత.. చంద్రబాబులో భయాందోళన

- నా పర్యటనలకు తీవ్ర ఆంక్షలు ఎందుకు
- కుప్పంలో అప్పు చెల్లించలేదని మహిళను చెట్టుకు కట్టేసి దాడి
- రైతులకు సాయం ఏదీ
- పుష్ప సినిమా డైలాగ్‌లకు కేసులు పెడితే ఎలా?
- సాక్షి కార్యాలయాలపై దాడులు ఎందుకు
- మీడియా సమావేశంలో మాజీ సీఎం వైఎస్ జగన్



**అమరావతి**

చంద్రబాబు ఏడాది పాలనపై ప్రజల్లో తీవ్ర అసహనం నెలకొంది. అందుకే ఆయనకు భయం చుట్టుకొని తమ అసహనాన్ని ప్రదర్శిస్తూ వైఎస్సార్‌సీపీ నేతలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని మాజీ సీఎం, వైయస్ఆర్‌సీపీ అధినేత వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆరోపించారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై గురువారం తాడేపల్లిలోని వైయస్ఆర్‌సీపీ కేంద్ర కార్యాలయంలో వైయస్ జగన్ మీడియాతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా డైవర్షన్ పాలిటిక్స్‌కు తెర లేపుతూ - మిగతా 3లో



## అమెరికా వీసా ఓ 'ప్రివిలేజీ' మాత్రమే.. 'హక్కు' కాదు

- ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘిస్తే ఆ వీసాను రద్దు చేసే అవకాశం
- భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం స్పష్టం చేసింది.
- స్టూడెంట్ లేదా పర్యటక వీసాపై వెళ్లేవారు మాదకద్రవ్యాలు తీసుకోవడం లేదా అమెరికా చట్టాలను ఉల్లంఘిస్తే భవిష్యత్తులో అమెరికా వీసాకు అనర్హులవుతారు

# లాసెట్‌లో బాలికలే టాపర్లు

- ఏపీ లాసెట్ ఫలితాలు విడుదల...
- ఉత్తీర్ణులకు మంత్రి నారా లోకేశ్ శుభాకాంక్షలు
- ఏపీ లాసెట్, పీజీఎల్‌సెట్ 2025 ఫలితాలు విడుదల
- ఫలితాలను ప్రకటించిన విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్
- మొత్తం 95 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత



**అమరావతి**

ఆంధ్రప్రదేశ్‌లో న్యాయ విద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఏపీ లాసెట్-2025, ఏపీ పీజీఎల్‌సెట్-2025 ఫలితాలు గురువారం మధ్యాహ్నం విడుదలయ్యాయి. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఈ ఫలితాలను అధికారికంగా ప్రకటించారు. విద్యార్థులు తమ ర్యాంక్ కార్డులను అధికారిక వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ ఏడాది లాసెట్ పరీక్షల్లో మొత్తం 95 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు మంత్రి నారా లోకేశ్ తన 'ఎక్స్' ఖాతా ద్వారా వెల్లడించారు. ఈ పరీక్షలకు మొత్తం 27,253 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, వారిలో 20,826 మంది అర్హత సాధించినట్లు ఆయన తెలిపారు. మరోసారి బాలికలే టాపర్లుగా నిలిచి తమ - మిగతా 3లో



## కాంగ్రెస్ నాయకత్వంతో విభేదాలు నిజమే... కానీ!

- కాంగ్రెస్ అధిష్టానంతో అభిప్రాయ భేదాలున్నాయన్న థరూర్
- అయితే పార్టీని వీడే ప్రసక్తే లేదని స్పష్టం చేసిన ఎంపీ
- నిలంబూర్ ఉప ఎన్నిక ప్రచారానికి తనను పిలవలేదన్న థరూర్
- థరూర్‌పై సొంత పార్టీ ఎంపీ రాజ్‌మోహన్ ఉన్నితన్ తీవ్ర విమర్శలు
- థరూర్ మనసు మోదీ దగ్గర, శరీరం కాంగ్రెస్‌లో ఉందని ఉన్నితన్ వ్యాఖ్య

# బనకచర్ల చుట్టూ రాజకీయం

**తిరుపతి,**



బనకచర్ల ప్రాజెక్టు రెండు తెలుగు రాష్ట్రాల మధ్య వివాదానికి కేంద్ర బిందువుగా మారింది. ఈ ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్‌కు జల భద్రతను ఇచ్చే కవచంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభివర్ణిస్తుంటే, తెలంగాణకు ఈ ప్రాజెక్టు శాపమని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి చెబుతున్నారు. గోదావరి నదిలో వృథాగా కలుస్తున్న 3 వేల టీఎంసీల వరద కలుస్తోందని ఏపీ ప్రభుత్వం చెబుతోంది. ఈ మూడు వేల టీఎంసీలలో 200 టీఎంసీల వరద నీటిని కరవు పీడిత ప్రాంతం రాయలసీమతోపాటు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు తరలించడం ప్రాజెక్టు లక్ష్యం. ఇది కరవు ప్రాంతాలను సస్యశ్యామలం చేయడంతోపాటు ఏపీకి తాగునీటి కొరత తీర్చేందుకు ఉద్దేశించి ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. దాదాపు 80 లక్షల మందికి సురక్షిత తాగునీరు అందుబాటులోకి వస్తుంది. వ్యవసాయ పరంగా చూస్తే సుమారు 7.5 లక్షల నుండి 12 లక్షల ఎకరాల వరకు కొత్తగా సాగు నీరు అందించవచ్చని నివేదికలు సూచిస్తున్నాయి. ఇది రాయలసీమకు వరప్రదాయినిగా చెప్పవచ్చు. వ్యవసాయ ఉత్పత్తులు ఈ ప్రాంతంలో గణనీయంగా పెరిగే అవకాశం ఉంటుందని ఏపీ ప్రభుత్వ పెద్దలు చెబుతున్నారు. దీంతో పాటు ఇప్పటికే ఉన్న 22.59 లక్షల ఎకరాల ఆయకట్టును సాగునీటిని స్థిరీకరించవచ్చు. కృష్ణా డెల్టాలో 13.08 లక్షల ఎకరాలకు, నాగార్జునసాగర్ కుడి కాలువ కింద 8 లక్షల ఎకరాలకు సాగునీటి స్థిరీకరణకు ఈ బనకచర్ల ప్రాజెక్టు ఉపయోగపడుతుందని అంచనా. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఏపీ పారిశ్రామిక అవసరాల కోసం 20 టీఎంసీల నీటిని వినియోగించుకోవచ్చు. ఇది పారిశ్రామిక అవసరాలను తీర్చే ప్రాజెక్టు కూడా. కొత్త పరిశ్రమలు స్థాపించేందుకు ఇది దోహదం చేస్తుంది. సెంట్రల్ వాటర్ కమిషన్‌కు బనకచర్ల ప్రాజెక్టుపై "ప్రీ-ఫీజిబిలిటీ రిపోర్ట్ " ను ఏపీ ప్రభుత్వం 2025, మే 22న సమర్పించింది. దీనిపై కేంద్ర జల సంఘం దృష్టి సారించింది. దీనిపై డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్ట్ ను సమర్పించడానికి ఏపీ నీటిపారుదల శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. పర్యావరణ అనుమతులు ఈ ప్రాజెక్టుకు కీలకమైనవి. ఈ క్రమంలో కేంద్ర పర్యావరణ నిపుణుల అంచనా కమిటీ జూన్ 17, 2025న సమావేశాన్ని నిర్వహించింది. ఇందులో - మిగతా 3లో

# ఆగస్టు 15 నుంచి ఫాస్టాగ్ వన్ ఇయర్

**ముంబై :** భారత ప్రభుత్వం ఫాస్టాగ్ ఇయర్ పాస్ అనే కొత్త విధానం తీసుకొచ్చింది. రూ. 3,000పెట్టి ఈ పాస్ కొనుగోలు చేయాల్సి ఉంటుంది. నేషనల్ హైవేలపై ఉన్న రద్దీని తగ్గించేందుకు ఈ విధానం తీసుకొచ్చినట్టు కేంద్రం చెబుతోంది. అంతే కాకుండా ఒకేసారి ఏడాదికి పాస్ తీసుకుంటే వాహనదారుడికి కూడా లాభం ఉంటుందని పేర్కొంటోంది. ఈ కొత్త విధానం 15 ఆగస్టు 2025 నుంచి అమల్లోకి రానుంది. ఫాస్టాగ్ ఇయర్ పాస్ అనేది ప్రైవేట్ వాహనాల కోసం రూపొందించిన విధానం. జాతీయ రహదారులపై ఉన్న టోల్‌గేట్‌ల వద్ద ఉన్న రద్దీ, ఇతర సమస్యలు తగ్గించేందుకు రూపొందించిన ప్రక్రియ. ఒకసారి రూ. 3,000తో రీఛార్జ్ చేస్తే ఒక సంవత్సరం పాటు వాడుకోవచ్చు. లేదా 200 సార్లు ప్రయాణాల చేసేందుకు కూడా వాడుకోవచ్చు. ఏది ముందు అవుతుందో దాన్ని పరిగణలోకి తీసుకుంటారు. ఈ ఇయర్ పాస్ తీసుకోవడంతో రోజు వారి పాస్ చెల్లింపులు పూర్తిగా తగ్గిపపోతాయి. అలాంటి వాహనాల కోసం ప్రత్యేకంగా రూట్ క్లియరెన్స్ ఉంటుంది. ఎలాంటి రద్దీ లేకుండా టోల్ స్టేషన్‌ల వద్ద ట్రాఫిక్‌లో ఇరుక్కోకుండా వెళ్లిపోవచ్చు. రహదారిపై రాకపోకలు సులభతరం అవుతుందనే ఉద్దేశంతోనే ఈ పథకాన్ని తీసుకొచ్చినట్టు రోడ్డు రవాణా, రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ ప్రకటించారు. ఈ ప్రక్రియతో జాతీయ రహదారులపై ప్రయాణం మరింత వేగవంతా సులభతరం అవుతుదని అభిప్రాయపడ్డారు. ఫాస్టాగ్ ఇయర్ పాస్ 15 ఆగస్టు 2025 నుంచి దేశవ్యాప్తంగా అమలులోకి వస్తుంది. రాజ్‌మార్గ్ యాత్ర యాప్ లేదా జాతీయ రహదారి అథారిటీ ఆఫ్ ఇండియా , రోడ్డు రవాణా అండ్ రహదారుల శాఖ అధికారిక వెబ్‌సైట్‌ల ద్వారా ఈ వార్షిక పాస్ కొనుగోలు చేయవచ్చు. ఈ పాస్‌ను కొనేందుకు మీకు ఫాస్టాగ్ ఖాతా, వెహికల్ రిజిస్ట్రేషన్ నెంబర్, ఆన్‌లైన్ వెరిఫికేషన్ అవసరం అవుతాయి. కొనుగోలు ప్రక్రియ చాలా సులభంగా ఉంటుంది. యాప్‌లో లేదా వెబ్‌సైట్‌లో ఒకసారి




లాగిన్ అయిన తర్వాత వాహనానికి సంబంధించిన వివరాలు ఎంటర్ చేయాల్సి ఉంటుంది. తర్వాత రూ. 3,000 చెల్లించాలి. ఆ తర్వాత మీ ఫాస్టాగ్‌కు ఈ పాస్ అటాచ్ అవుతుంది. ఈ పాస్ ఒక సంవత్సరం మాత్రమే పని చేస్తుంది. లేదా 200 ట్రిప్‌లు మాత్రమే చెల్లుబాటు అవుతుంది. ఈ రెండింటిలో ఏది ముందు అయితే దాన్నే పరిగణలోకి తీసుకుంటారు. ఒక ట్రిప్ అంటే ఒక టోల్ గేట్‌ను దాటడాన్ని ట్రిప్ అంటారు. ఉదాహరణకు హైదరాబాద్ నుంచి ఢిల్లీకి వెళ్లే మార్గంలో చాలా టోల్ గేట్‌లు ఉంటాయి. అందులో ఒక్కో టోల్‌గేట్ ప్రవేశం నుంచి ఎగ్జిట్ వరకు ఒకే ప్రయాణంగా లెక్కిస్తారు. అంటే ఎన్ని టోల్‌గేట్‌లు దాటితే అన్ని ట్రిప్‌లగా గుర్తిస్తారు. ఇలా 200 ప్రయాణాలు పూర్తైన తర్వాత మళ్లీ రూ. 3,000 చెల్లించి రీచార్జ్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ పాస్ జాతీయ రహదారుల మీద మాత్రమే పనిచేస్తుంది. రాష్ట్ర రహదారులు లేదా స్థానిక టోల్ గేట్‌ల వద్ద పని చేయదు. అక్కడ కచ్చితం గా టోల్ రుసుములు చెల్లించాలి. ఇది కార్లు, జీపులు, వ్యాన్ లు వంటి వ్యక్తిగత అవసరాల కోసం నిర్దేశించిన వాహనాలకు మాత్రమే చెల్లుబాటు అవుతుంది. ఈ పాస్ మాల్స్, విమానాశ్ర యాలు, లేదా పార్కింగ్ స్థలాల్లో పనిచేయదు. హైదరాబాద్ అవుటర్ రింగ్‌రోడ్డుపై కూడా టోల్ స్టేషన్‌లు ఉన్నాయి. అక్కడ మాత్రం ఈ ఇయర్ టోల్ పాస్ పని చేయదు. అక్కడ మీరు ఎప్పటికప్పుడు చెల్లింపులు చేసుకోవాల్సి ఉంటుంది. రోజూ జాతీయ రహదారిపై ప్రయాణించే వారికి ఎక్కువ ఉపయోగపడుతుంది. ఢిల్లీ, ముంబై, చెన్నై, హైదరాబాద్, వైజాగ్, విజయవాడ వంటి పెద్ద నగరాల మధ్య ఎక్కువ సార్లు తిరిగే వాళ్లకు యూజ్ అవుతుంది.

# ఐటీ ఉద్యోగుల నెత్తిన మరో పిడుగు?!

మీరు ఐటీ ఉద్యోగులా?. అయితే మీ నెత్తిన మరో గుదిబండ పడబోతోంది!. త్వరలో ఐటీ రంగంలో పనిగంటలు పెరుగుతున్నట్లు తెలుస్తోంది. ఆ దిశగా సిలికాన్ వ్యాలీ ఆఫ్ ఇండియా బెంగళూరులో తొలి అడుగు పడబోతోంది. ఐటీ సెక్టార్‌లో పని గంటలను పెంచే యోచనలో కర్ణాటక ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందంటూ దక్కన్ హెరాల్డ్ ఓ కథనాన్ని ప్రముఖంగా ప్రచురించింది. ప్రస్తుతం కర్నాటకలో సెక్షన్7,కర్ణాటక షాప్స్, కమిర్షియల్ ఎస్టాబ్లిష్ మెంట్ యాక్ట్ 1961 ప్రకారం.. 9 పని గంటలు కొనసాగుతున్నాయి. పండగలు, పబ్బాలు వంటి కొన్ని ప్రత్యేక సందర్భాల్లో కనీసం సంవత్సరంలో ఏదైనా మూడు నెలల్లో ఉద్యోగులతో అదనంగా 10 గంటలు పనిచేయించుకోవచ్చు. ఈ పనిగంటలు 50 గంటలు మించకూడదు. కానీ కర్ణాటక ప్రభుత్వం తాజాగా కొత్త పనిగంటల ప్రతిపాదనలు తెరపైకి తెరపైకి తెచ్చినట్లు దక్కన్ హెరాల్డ్ హైలెట్ చేసింది. ఉద్యోగులు ఇకపై 10 పని గంటలు, అదనంగా 12 గంటలు పనిచేయించుకుంటే ఎలా ఉంటుందా? అనే దిశగా ప్రభుత్వం కార్మికశాఖ, ఐటీ రంగ నిపుణులతో చర్చలు జరుపుతోంది. ఫలితంగా ప్రత్యేక సందర్భాలలో అదనంగా చేసే పనిగంటలు 50 నుంచి ఏకంగా 140 గంటలు చేరుకోనున్నాయి.

కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయంపై కార్మిక సంఘాల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతుంది. పనిగంటల్ని పెంచి ఉద్యోగుల హక్కుల కాలరాజేసే ప్రయత్నం చేస్తోందని ఆరోపిస్తున్నాయి. పనిగంటలు పెంచడం వల్ల ఉద్యోగులు




తమ హక్కులపై ప్రతికూల ప్రభావంతో పాటు పర్సనల్ లైఫ్, ఫ్రొఫెషనల్ లైఫ్‌కు విఘాతం కలుగుతోందని అంటున్నారు. కర్ణాటకతో పాటు ఏపీలో కూటమి ప్రభుత్వంపై సైతం పనిగంటల్ని పెంచే ప్రతిపాదనలు తెరపైకి తెచ్చినట్లు సమాచారం. రాష్ట్రంలో వ్యాపారాన్ని సులభతరం చేయడంతో పాటు ఇన్వెస్టర్లను ఆకట్టుకునేలా తొమ్మిది పనిగంటల్ని పది పనిగంటలు చేసే దిశగా ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది. ఉద్యోగులకు, సంస్థలకు లబ్ధి చేకూరేలా కార్మిక చట్టాల్ని మార్చే యోచనలో ఉందని డక్కెన్ హెరాల్డ్ తన కథనంలో ప్రస్తావించింది. అంతేకాదు పనిగంటలు పెంచి పనిచేసే ప్రాంతాల్లో రాత్రి వేళ పనిదినాల్లో మహిళలకు వెసులు బాటు కల్పించడంతో పాటు రవాణ, భద్రత, సెక్యూరిటీ, లైటింగ్ మెరుగుపరుచుకునే దిశగా చర్యలు తీసుకోనుందని వెల్లడించింది. పని గంటలను పొడిగించాలనే ప్రభుత్వ ప్రణాళికను కర్ణాటకలోని అనేక కార్మిక సంఘాలు వ్యతిరేకించాయి. బుధవారం, రాష్ట్ర కార్మిక శాఖ పరిశ్రమ, కార్మిక సంఘాల ప్రతినిధులతో ఒక సమావేశాన్ని నిర్వహించి చట్టానికి సాధ్యమయ్యే సవరణపై చర్చించింది. కర్ణాటక రాష్ట్ర ఐటీ/ఐటీఈఎస్ ఉద్యోగుల సంఘం (కేఐటీయూ) సమావేశంలో పాల్గొని ఈ ఆలోచనను స్పష్టంగా వ్యతిరేకించింది. కేఐటీయూ ఈ ప్రతిపాదనను బానిశత్వంగా అభివర్ణించింది. కార్మికుల ఆరోగ్యం, పని-జీవిత సమతుల్యత, ఉద్యోగ భద్రతకు హాని కలిగిస్తుందని పేర్కొంది. పనిగంటల విషయంలో ప్రభుత్వ ప్రతిపాదనల్ని టెక్నాలజీ రంగ ఉద్యోగులు వ్యతిరేకించాలని, వారికి అండగా నిలవాలని యూనియన్ విజ్ఞప్తి చేసింది. పనిగంటలు పెరిగితే భారీ ఎత్తున ఉద్యోగుల తొలగింపులు.. ఉద్యోగులపై ఒత్తిడి పెరుగుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# కదలని 'ఇరాన్ నీడలు'.. ఒంటరిగా టెహ్రాన్

**ఇంటర్నెట్‌డెస్క్:** పశ్చిమాసియా రణరంగంలా మారింది. ఇజ్రాయెల్- ఇరాన్ పరస్పరం బాంబుల మోత మోగిస్తున్నాయి. ఇప్పటికే ఇరుదేశాల్లోని కీలక ప్రాంతాలు ధ్వంసమయ్యాయి. మరోవైపు తమతో అణుకార్యక్రమానికి ఒప్పందం కుదుర్చుకోవడం లేదన్న గుర్రుతో అగ్రరాజ్యం అమెరికా కూడా ఇరాన్‌పై కత్తులు నూరుతోంది. అదును చూసి దెబ్బ కొట్టేందుకు సిద్ధంగా ఉంది. ఈ క్రమంలో ఇరాన్ రాజకీయ నాయకత్వ మనుగడే ప్రశ్నార్థకంగా మారింది. ఇంత జరుగుతున్నా.. ఇన్నాళ్లూ ఇరాన్ పాలు పోసి పెంచిన హమాస్ హెజ్‌బొల్లా హూతీలు లాంటి ముసుగు సంస్థల జాడ ఏమాత్రం కనిపించడం లేదు. పెద్దన్నకు ఆపదొస్తే.. తమ్ముళ్లంతా ఎటు వెళ్లినట్లు? పశ్చిమాసియాలో ఓ బలమైన శక్తిగా ఎదిగిన ఇరాన్.. అనధికారిక సైన్యాన్ని పెద్ద ఎత్తున సమకూర్చుకుంది. పాలస్తీనాలో హమాస్, లెబనాన్‌లో హెజ్‌బొల్లా, యెమెన్‌లో హూతీలు, ఇరాక్‌లో కొన్ని ముసుగు సంస్థలను (ప్రాక్సీ దళాలు) ఏర్పాటు చేసి.. ప్రత్యక్షంగా, పరోక్షంగా వాటి అభివృద్ధికి దోహదపడింది. నేరుగా తాను యుద్ధరంగంలోకి దిగకుండా.. శత్రుదేశాలపై వీరిని ఉసిగొల్పేది. ఈ క్రమంలోనే ఇజ్రాయెల్ -హమాస్ యుద్ధం మొదలైంది. ఆ ఉగ్ర సంస్థకు సాయం చేసేందుకు హెజ్‌బొల్లా ముందుకురావడంతో ఆ యుద్ధం బీరుట్ వరకు ఎగబాకింది. ఇజ్రాయెల్ ప్రతాపానికి హమాస్, హెజ్‌బొల్లాలోని అగ్రనాయకత్వం తుడిచిపెట్టుకుపోయాయి. ఆయా వర్గాల్లో అంతర్గత కుమ్ములాటలు కూడా మొదలైనట్లు తెలుస్తోంది. వారిని ఏకతాటి మీదకు తీసుకురావాల్సిన ఇరాన్‌లో ప్రస్తుతం అనిశ్చితి కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఎవరికివారే యమునా తీరే అన్నట్లు వ్యవహరించడంతో 'ఇరాన్' ఒంటరి పోరాటం సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**చతికిల పడిన నమ్మినబంటు**

హెజ్‌బొల్లా.. లెబనాన్‌లో అత్యంత శక్తివంతమైన షియా పారామిలటరీ గ్రూప్. ఇరాన్‌కు నమ్మిన బంటు. గతంలో ఇజ్రాయెల్ హమాస్‌పై దాడికి దిగిన సమయంలో.. 'పెద్దన్న' ఆదేశాలతో లెబనాన్ సరిహద్దులోని ఇజ్రాయెల్ ప్రాంతాలపై క్షిపణి దాడులకు దిగింది. అలాంటిది.. ఇరాన్‌కే ఆపద ముం



చుకొస్తున్న సమయంలో మాత్రం స్తబ్దుగా వ్యవహరిస్తోంది. అయితే, ఇజ్రాయెల్ దాడుల్లో ఇప్పటికే హెజ్‌బొల్లా తీవ్రంగా నష్టపోయినట్లు తెలుస్తోంది. అగ్రనేత హసన్ నస్రల్లాను ఇజ్రాయెల్ సైన్యం మట్టుబెట్టింది. ఆ తర్వాత దాని పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. నాయకత్వ లేమితోపాటు, శక్తి సామర్థ్యాలపై నమ్మకం సన్నగిల్లినట్లు అధ్యయనాలు కూడా చెబుతున్నాయి. అంతేకాకుండా ప్రస్తుత అగ్రనేత నయీమ్ ఖాసిమ్ ఇరాన్‌కు అనుకూలంగా వ్యవహరించడం లేదన్న వాదనలు కూడా ఉన్నాయి. ఈ తరుణంలో మరోసారి యుద్ధ రంగంలోకి దిగేందుకు హెజ్‌బొల్లా వెనకడుగు వేస్తోంది.

**హమాస్..శిథిలం**

పాలస్తీనా మిలిటెంట్ గ్రూప్ హమాస్.. గాజాలో స్వయం ప్రకటిత రారాజుగా వర్ధిల్లింది. అయితే, రెండేళ్ల క్రితం ఇజ్రాయెల్‌తో ప్రారంభమైన యుద్ధం తర్వాత దాదాపు నామరూపాల్లేకుండా పోయింది. అగ్రనేతలు హనియే, సిన్వర్‌లను ఇజ్రాయెల్ సైన్యం ఐడీఎఫ్ మట్టుబెట్టింది. అంతేకాకుండా టెల్‌అవీవ్ బాంబు దాడులతో గాజా ప్రాంతం శిథిలమైంది. సంక్షోభ పరిస్థితుల్లో హమాస్‌ను ముందుండి నడిపించాల్సిన నేత ఖలీద్ ఖతార్‌కు పారిపోయాడు. దీంతో నాయకత్వ లేమితో హమాస్ ఇబ్బందులు పడుతోంది. ఈ క్రమంలో ఇరాన్‌కు మద్దతిచ్చేందుకు ఆ గ్రూప్ క్షేత్రస్థాయి నాయకులు ఎంతవరకు సిద్ధంగా ఉన్నారన్నది ప్రశ్నార్థకంగా మారింది.

**మిలీషియాల పరిస్థితి అంతే..**

ఇరాన్‌తో పొత్తుపెట్టుకున్న ఇరాక్‌లోని షియా మిలీషియాలు (ఖతాయిబ్ హెజ్‌బొల్లా) అక్కడి అమెరికా దళాలకు వ్యతిరేకంగా పోరాడుతూ, ఇరాన్ ప్రయోజనాలను కాపాడేవారు. కానీ, ప్రస్తుతం అమెరికా నేరుగా ఇరాన్‌పైనే దాడులకు సిద్ధమవుతున్న తరుణంలో ఇకపై ఇరాక్‌లోని షియా మిలిషియాలు కూడా వెనక్కి తగ్గే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇరాన్‌పై ఇజ్రాయెల్ తొలిసారిగా జనవరిలో దాడులకు తెగబడింది. అప్పట్లో షియా మిలీషియా గ్రూప్ కేవలం దాడులను వ్యతిరేకిస్తున్నట్లు ప్రకటించింది. కానీ, ఇరాన్‌కు అండగా ఉంటున్నట్లు మాత్రం చెప్పలేదు. మరోవైపు అటు ఇరాన్, ఇటు అమెరికాతో మంచి సంబంధాలున్న ఇరాక్ ప్రధాని మహ్మద్ అల్ సుడానీ కూడా మిలీషియా కమాండర్లను సంఘర్షణలకు దూరంగా ఉండాలని సూచించారు. దీంతో వారు కూడా ఇరాన్‌కు మద్దతుగా నిలిచే పరిస్థితులు కనిపించడం లేదు.

**కాస్త దగ్గరగా ఉన్నది హూతీలే!**

ఇరాన్ పెంచి పోషించిన ముసుగు సంస్థల్లో ప్రస్తుతం ఆ దేశానికి కాస్తో కూస్తో మద్దతుగా నిలుస్తున్నవారు హూతీలే. ఇజ్రాయెల్‌పై క్షిపణులు ప్రయోగించారు. అమెరికా, ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా పని చేస్తున్నప్పటికీ.. వారు కూడా ఆత్మరక్షణలో పడ్డారు. మార్చి, ఏప్రిల్ నెలల్లో హూతీలకు చెందిన పలు క్షిపణులను అమెరికా నేల కూల్చింది. దీంతో వారికి కూడా భయం పట్టుకుంది. ఇరాన్‌కు మద్దతిస్తున్నటు చెబుతున్నారనే తప్ప..పూర్తి స్థాయిలో ముందుకు రావడం లేదు. ఈ పరిణామాల నేపథ్యంలో.. ఇజ్రాయెల్, అమెరికాల దూకుడును ఒంటరిగా మారిన ఇరాన్ ఎంతవరకు నిలువరిస్తుందో చూడాలి.

## 15 రోజుల్లోగా ఓటర్ ఐడీ కార్డుల డెలివరీ




**న్యూఢిల్లీ:** ఎలక్టర్ ఫొటో ఐడెంటిటీ కార్డు(ఎపిక్)ను ఓటర్లకు చేరవేసే విషయంలో ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. 15 రోజుల్లోగానే ఈ కార్డులు సంబంధిత ఓటర్లకు చేరేలా చర్యలు తీసుకోనున్నట్లు బుధవారం వెల్లడించింది. ప్రస్తుతం ఈ కార్డుల డెలివరీకి నెల రోజులకుపైగా సమయం పడుతోంది. ఇప్పుడు ఈ సమయం సగానికి తగ్గిపోనుంది. ఇందుకోసం నూతన ప్రామాణిక నియమావళిని ఎన్నికల సంఘం రూపొందించింది. కొత్తగా ఓటర్‌గా పేరు నమోదు చేసుకున్న తర్వాత లేదా ప్రస్తుతం ఉన్న కార్డులో మార్పులు చేర్పులు చేసుకున్న తర్వాత 15 రోజుల్లోగా నూతన ఫొటో గుర్తింపు కార్డు ఓటర్లకు అందనుంది.

ఓటరు గుర్తింపు కార్డు కోసం ఆన్‌లైన్‌లో ఇలా దరఖాస్తు చేసుకోండి.

1. ముందుగా voters.eci.gov.in వైబ్‌సైట్ ఓపెన్ చేయాలి.
2. న్యూ రిజిస్ట్రేషన్ ఫర్ జనరల్ ఎలక్టర్స్‌లో 'ఫిల్ ఫామ్ 6'పై క్లిక్ చేయండి.
3. ఫిల్ ఫామ్ 6పై క్లిక్ చేయగానే లాగిన్ అడుగుతుంది.
4. కొత్త యూజర్లు మొబైల్ నంబర్, ఇమెయిల్ ID, క్యాప్చా కోడ్ ఎంటర్ చేయాలి.
5. తర్వాత మీ మొబైల్‌కు ఓటీపీ వస్తుంది.
6. మీ పేరు, పాస్‌వర్డ్ ఎంటర్ చేసి OTPని నమోదు చేయండి.
7. ఇప్పుడు ఫిల్ ఫామ్ 6పై క్లిక్ చేస్తే.. లింక్ ఓపెన్ అవుతుంది.
8. ఫామ్ 6లో మీ రాష్ట్రం, జిల్లా, నియోజవర్గం వివరాలు నమోదు చేయాలి.
9. మీ పూర్తి పేరు వివరాలతో పాటు పాస్‌పోర్ట్ ఫొటో అప్‌లోడ్ చేయాలి.
10. ఫోన్, ఆధార్ నంబరు, జెండర్, పెట్టినతేదీ, చిరునామాలతో పాటు సంబంధిత పత్రాలు అప్‌లోడ్ చేయాలి.

ఈ వివరాలు అన్ని నమోదు చేసిన తర్వాత దరఖాస్తును ప్రివ్యూలో చూసుకుసుకోవాలి. అన్ని వివరాలు కరెక్టుగా ఉన్నాయని భావిస్తే సబ్మిట్ చేయాలి. 15 రోజుల్లోగానే ఎలక్టర్ ఫొటో ఐడెంటిటీ కార్డు మీరు పొందుతారు.

## ఇంగ్లీషులో మాట్లాడేవారు సిగ్గుపడే రోజులు వస్తాయి



**ఇంటర్నెట్ డెస్క్:** విదేశీ భాషలకు సంబంధించి కేంద్ర మంత్రి అమిత్ షా కీలక వ్యాఖ్యలు చేశారు. ఇంగ్లీషులో మాట్లాడేవారు సిగ్గుపడే రోజులు వస్తాయని, అలాంటి సమాజం ఏర్పడే రోజులు ఎంతో దూరంలో లేవన్నారు. మన దేశ భాషలే మన సంస్కృతికి రత్నాలని పేర్కొన్న ఆయన.. అవి మనుగడలో లేకుంటే నిజమైన భారతీయులుగా ఉండలేమని వ్యాఖ్యానించారు. మాజీ ఐఏఎస్ అశుతోష్ అగ్నిహోత్రి రాసిన ఓ పుస్తకాన్ని ఆవిష్కరించిన సందర్భంగా అమిత్ షా ఈ విధంగా మాట్లాడారు. "ఈ దేశంలో ఇంగ్లీషులో మాట్లాడేవారు సిగ్గుపడే రోజులు వస్తాయి. అటువంటి సమాజం ఏర్పడే రోజులు ఎంతో దూరంలో లేవు. మన దేశ భాషలే మన సంస్కృతికి రత్నాలు. మన భాషలే లేకుంటే మనం నిజమైన భారతీయులుగా ఉండలేం. దేశ భాషా వారసత్వాన్ని పునరుద్ధరించే సమయం ఆసన్నమైంది. ఇందుకోసం ప్రయత్నం చేయాలి" అని అమిత్ షా పిలుపునిచ్చారు. మన దేశాన్ని, మన సంస్కృతిని, మన మతాన్ని అర్థం చేసుకునేందుకు ఏ పరాయి భాష సరిపోదన్నారు. విదేశీ భాషలతో సంపూర్ణ భారతీయ భావనను ఊహించుకోలేమన్నారు. అయితే, ఇది ఎంత కష్టమో తనకు తెలుసని, అయినప్పటికీ ఇందులో భారత సమాజం విజయం సాధిస్తుందన్న విశ్వాసం ఉందన్నారు. మన దేశంతోపాటు ప్రపంచాన్ని కూడా మన సొంత భాషలతోనే నడిపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఐఏఎస్ అగ్నిహోత్రి మాట్లాడుతూ.. కేంద్ర సర్వీసు ఉద్యోగులకు ఇచ్చే శిక్షణలో మార్పు ఎంతో అవసరమని అన్నారు.

## ఇజ్రాయెల్ నుంచి భారత పౌరుల తరలింపు కోసం.. ఆపరేషన్ సింధు

**న్యూఢిల్లీ:** ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు తీవ్రమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇటీవల ఇరాన్ నుంచి విద్యార్థులు, పౌరులను సురక్షితంగా భారత్ తరలించింది. అలాగే 'ఆపరేషన్ సింధు' కింద ఇజ్రాయెల్ నుంచి భారత పౌరులను తరలించేందుకు భారత్ సిద్ధమైంది. విదేశాంగ మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) ఈ విషయాన్ని గురువారం ప్రకటించింది. ఇజ్రాయెల్‌లో ఉన్న భారతీయ పౌరులు స్వదేశానికి తిరిగి రావాలనుకుంటే టెల్ అవీవ్‌లోని భారత రాయబార కార్యాలయం సహాయం అందిస్తుందని తెలిపింది. కాగా, ఇజ్రాయెల్‌లో ఉన్న భారతీయ పౌరుల భద్రత కోసం అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. 'భారతీయులను తరలించడానికి టెల్ అవీవ్‌లోని భారత రాయబార కార్యాలయం ఏర్పాట్లు చేస్తున్నది. మరోవైపు ఏవైనా సందేహాలు ఉంటే టెల్ అవీవ్‌లోని భారత రాయబార కార్యాలయంలో ఏర్పాటు చేసిన 24/7 కంట్రోల్ రూమ్‌ను సంప్రదించవచ్చని విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది.

## అమెరికా వీసా ఓ 'ప్రివిలేజీ' మాత్రమే.. 'హక్కు' కాదు

ఇంటర్నెట్ డెస్క్: వీసా అనేది ఓ ప్రివిలేజీ మాత్రమేనని, అది హక్కు కాదని భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం మరోసారి పేర్కొంది. వీసా జారీ చేసిన తర్వాత కూడా స్క్రీనింగ్ ఉంటుందని తెలిపింది. ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘిస్తే అధికారులు ఆ వీసాను రద్దు చేసే అవకాశం ఉంటుందని స్పష్టం చేసింది. అంతేకాకుండా స్టూడెంట్ లేదా పర్యటక వీసాపై వెళ్లేవారు మాదకద్రవ్యాలు తీసుకోవడం లేదా అమెరికా చట్టాలను ఉల్లంఘిస్తే భవిష్యత్తులో అమెరికా వీసాకు అనర్హులవుతారని ఉద్ఘాటించింది. అక్రమ వలసదారులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ (%ణశీఅఖశ్రీసఎతీబఎజూ%) ఉక్కుపాదం మోపుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో అక్రమ వలసదారుల అరెస్టులకు నిరసనగా లాస్ ఏంజెలెస్‌లో మొదలైన ఆందోళనలు తీవ్ర ఉద్రిక్తంగా మారాయి. అవి దేశమంతటా వ్యాపించాయి. అయినప్పటికీ సోదాలను ఆపేదిలేదని ట్రంప్ ప్రభుత్వం స్పష్టం చేసింది. అక్రమ వలసదారులను అరెస్టుచేసి స్వదేశాలకు తిప్పి పంపుతామని పేర్కొంది. ఈ నేపథ్యంలోనే భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం తాజా ప్రకటన చేసింది. గడిచిన నెల వ్యవధిలో మూడుసార్లు ఇటువంటి ప్రకటన చేయడం గమనార్హం. అయితే, చట్టబద్ధంగా అమెరికాకు వచ్చే వారికి ఎప్పుడూ ఆహ్వానం ఉంటుందని పేర్కొన్న యూఎస్ ఎంబసీ.. అక్రమ ప్రవేశం, వీసా దుర్వినియోగానికి పాల్పడితే మాత్రం సహించేది లేదని స్పష్టం చేసింది. మరోవైపు ఇటీవల తాత్కాలికంగా నిలిపివేసిన విద్యార్థి వీసా ఇంటర్వ్యూల షెడ్యూలింగ్‌ను అమెరికా మళ్లీ ప్రారంభించింది. అయితే, వీసా కోసం దరఖాస్తు చేసుకునే విద్యార్థుల సోషల్ మీడియా ఖాతాలను తప్పనిసరిగా తనిఖీ (%వాశీఎఖశ్రీ వీవఎఖ ఎవ్ఆఅస్త్ర%) చేస్తామని వెల్లడించింది. ఈమేరకు అమెరికా విదేశాంగ శాఖ తాజాగా మార్గదర్శకాలు విడుదల చేసింది.

# ఏడాదికే తీవ్ర వ్యతిరేకత..
# చంద్రబాబులో భయాందోళన

-మొదటిపేజీ తరువాయి

వైయస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేయిస్తున్నారని మండిపడ్డారు. గంగమ్మతల్లి జాతరలో వేట తలలు నరికినట్టు రప్పారప్పా నరుకుంతాం.. అని పుష్ప సినిమా డైలాగులు, పుష్పా సీన్లు, తగ్గేదేలే పుష్పా అని మేనరిజరం ప్రదర్శించినా కేసులు పెడతారా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో దిగజారిపోయిన లా అండ్ ఆర్డర్ పరిస్థితులు, పాలనా వైఫల్యాలు, మోసాలు, అబద్ధాల మధ్య పాలన కొనసాగిస్తున్నారు. సంవత్సరం తిరిగే నాటికల్లా ఒక ప్రభుత్వం ఇంత తీవ్రమైన వ్యతిరేకత ప్రజల్లో చోటు చేసుకోవడం అన్నది బహుశా దేశ చరిత్రలోనే తక్కువ, అరుదైన పరిస్థితులేమో. అంత తీవ్రమైన వ్యతిరేకత చంద్రబాబు నాయుడు గారి ప్రభుత్వం మీద కనిపించిన పరిస్థితులు. ఇలాంటి నేపథ్యంలో చంద్రబాబు నాయుడు తాను చేస్తున్న డైవర్షన్ పాలిటిక్స్, చంద్రబాబు నాయుడు గారి ప్రతి మాటలోనూ అసహనం కనిపిస్తోంది. అందుకే నియంతగా తాను మారి, అణిచివేత అన్న పదానికి నిజంగా ఒక నిర్వచనంగా చంద్రబాబు నాయుడు తయారయ్యారు. సత్తెనపల్లి పల్నాడు ఏరియాలో నా పర్యటన నిజంగా ఒక కర్ఫ్యూ పరిస్థితుల మధ్య జరిగింది. ఆశ్చర్యం కలిగించే విషయం. అసలు ప్రజలను, లేదా మా పార్టీ కార్యకర్తల్ని పరామర్శించడం అన్నది ఒక ప్రతిపక్ష నాయకుడు చేస్తే తప్పా అని అడుగుతున్నా? చంద్రబాబును సూటిగా ఈ ప్రశ్న అడుగుతున్నా. ఎందుకు ఇన్నిన్ని ఆంక్షలు పెట్టాలి? ఎందుకు పోలీసుల్ని ఎక్కడ పడితే అక్కడ పెట్టి ప్రోగ్రామ్ కు ఎవరూ రాకూడదు అని ఆదేశాలు జారీ చేసి, ఎందుకు వచ్చిన వాళ్లందరినీ ఎక్కడికక్కడ కట్టడి చేసే కార్యక్రమం ఎందుకు చేయాల్సి వచ్చింది? ప్రతిపక్ష నాయకుడు ప్రజల్ని కలవడానికి వెళ్లినప్పుడు గానీ, లేదా పార్టీ నాయకుల్ని పరామర్శించడానికి వెళ్లినప్పుడుగానీ ఎందుకు ఇటువంటి ఆంక్షలు విధించాలి అని అడుగుతున్నా. మొన్న పొగాకు రైతులకు సంబంధించి పొదిలి వెళ్తే అక్కడ కూడా నిజంగా ఆశ్చర్యం కలిగించే విషయం.. పొగాకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర రావడం లేదు. అలాంటి నేపథ్యంలో ఇద్దరు ఆత్మహత్యలు జరిగాయి. పర్చూరు, కొండెపిలో. ఇలాంటి పరిస్థితుల మధ్య అక్కడ జరుగుతున్న పరిస్థితుల మధ్య రైతులకు సంఘీభావంగా ప్రతిపక్ష నాయకుడు అక్కడికి వెళ్తే ఆ కార్యక్రమంలో రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొంటే.. దాదాపుగా 40 వేల పైచిలుకు ఆ కార్యక్రమంలో పాల్గొంటూ ఆ ప్రోగ్రామ్ జరుగుతున్నప్పుడు... 40 మందే.. ఎంచినా కూడా అంతకన్నా ఎక్కువ మంది కూడా కనపడరు. 40 మందితో నువ్వు.. 40 వేల మందితో జరిగే ప్రోగ్రామ్ మీద రాళ్లు వేయాలని ప్రయత్నం చేస్తావు. ఆశ్చర్యం కలిగించే విషయం అది. ఏం జరుగుతోంది? రైతుల సమస్యలు హైలెట్ కాకూడదా? రైతుల తరఫున ఎవరూ మాట్లాడకూడదా? రైతులకు సంఘీభావంగా ఎవరూ వెళ్లకూడదా? రైతుల సమస్యలనేవి ఎవరూ పట్టించుకోకూడదా? 40 వేల మంది, ప్రజలు రైతులతో జరిగే కార్యక్రమాన్ని నువ్వు 40 మంది చేత నువ్వు డిస్టర్బ్ చేయాలని ప్రయత్నం చేస్తావ్. ఇంకా రైతులు,



ప్రజలు సంయమనం పాటించారు కాబట్టే 40 వేల మంది 40 మంది మీద పడలేదు. ఒకవేళ పడి ఉంటే పరిస్థితులు ఏ మాదిరిగా ఉండేదో నేను చెప్పాల్సిన పని లేదు. ఎవరైనా ఊహించుకోగలరు. 40 మంది చేత గొడవ నువ్వు చేయిస్తావు. ఉల్టా రైతుల మీద నువ్వే కేసులు పెడతావు. నేను అడుగుతున్నా చంద్రబాబును. ఎందుకు ఇంత భయపడుతున్నావు. ఎందుకింత అసహనం.

ప్రజల సమస్యల పట్ల ఎవరైనా కూడా గొంతు విప్పితే చాలు.. చంద్రబాబు నాయుడు నోట్లో నుంచి వచ్చే మాటలు ఏ స్థాయిలో ఉన్నాయంటే.. భూ స్థాపితం చేస్తాడంట. ఆశ్చర్యం కలిగించే మాటలు. 76 ఏళ్ల వయసులో ఉన్న ఆయన.. ఒక ముఖ్యమంత్రి స్థానంలో కూర్చుని ఉన్న వ్యక్తి ఒక టీవీ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకుడిని భూస్థాపితం చేస్తాడంట. ప్రతిపక్ష నాయకుడి పేరు ఎత్తి భూస్థాపితం చేస్తాడంట. ఆ ఎల్లో మీడియాకు సంబంధించిన ఓనర్ అడుగుతాడు.. ఎప్పుడు భూస్థాపితం చేస్తావని, ఈయన అదిగో మొదలు పెట్టేశాను, చేస్తున్నాను, త్వరలో చేసేస్తాను అంటాడు. ఆశ్చర్యం.. 76 ఏళ్ల ముసలాయన ఈయన. ఈ వయసులో రెడ్ బుక్ రాజ్యాంగ పాలన ఏమిటి, ఈ బెదిరింపులేమిటి? వాడ్ని తొక్కుతా, వీడ్ని తొక్కుతా అన్న మాటలేమిటి? నిజంగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి జరిగిన పరిస్థితికి గానీ, ఈ లిక్కర్ కేసులో జరుగుతున్న దర్యాప్తు ప్రక్రియ గానీ ఇవన్నీ కూడా చూస్తే సామాన్యుడు ఎవడూ బతకలేడు. ఎవిడెన్స్ అనేవి నువ్వు క్రియేట్ చేస్తున్నావు, మాన్యుఫాక్చర్ చేస్తున్నావు. ఈ మాదిరిగా తప్పుడు సంప్రదాయానికి నువ్వు నాంది పలికితే రేపొద్దున వ్యవస్థ బతుకుతుందా? నక్సలిజం అనేది ఇట్లాంటి దాంట్లో నుంచే పుడతాది. సామాన్యుడి మీద ఇట్లాంటివి ఎవడైనా ప్రదర్శిస్తేనే నక్సలిజం అనేది పుడుతుంది. కుప్పం నియోజకవర్గంలో ఒక మహిళను చెట్టుకు కట్టేసి కొట్టినా దిక్కులేకుండా పోయింది. సాక్షి కార్యాలయాలపై టీడీపీ నేతలు పక్కా ప్రణాళికతో దాడులు చేశారని ధ్వజమెత్తారు.

**తెలంగాణ ఫోన్ ట్యాపింగ్‌తో నాకేం సంబంధం?: వైఎస్ జగన్**

తెలంగాణ రాష్ట్రంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ అంశంతో తనకేంటి సంబంధమన్నారు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. తన ఫోన్‌ను దగ్గరి వాళ్లు ట్యాపింగ్ చేశారని షర్మిల చేసిన వ్యాఖ్యలపై.. మీడియా అడిగిన ప్రశ్నకు వైఎస్ జగన్ స్పందించారు. పక్క? రాష్ట్రంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్‌తో తనకు సంబంధమేంటన్నారు వైఎస్ జగన్. 'ఫోన్ ట్యాపింగ్ ఎవరు చేశారు?, కేసీఆర్ ప్రభుత్వం.. షర్మిలమ్మ ఫోన్ ట్యాప్ చేసిందా?, అప్పట్లో ఆమె తెలంగాణ రాష్ట్రంలో పార్టీ పెట్టింది కాబట్టి చేశారేమో.. చేశారో, లేదో నాకేం తెలుస్తుంది. ఆ ఫోన్ ట్యాపింగ్‌కు నాకు ఏం సంబంధం?' అని వైఎస్ జగన్ ప్రశ్నించారు. గురువారం తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో వైఎస్ జగన్ మాట్లాడారు. రాష్ట్రంలో దిగజారిన లాండ్ ఆర్డర్, పాలన వైఫల్యాలు, మోసాల మధ్య చంద్రబాబు పాలన కొనసాగుతోందని మండిపడ్డారు. దీనిలో భాగంగా మీడియా అడిగిన ప్రశ్నకుల సమాధానమిచ్చారు వైఎస్ జగన్.

**నేను పరామర్శకు వెళ్లడం తప్పా?**

పల్నాడు జిల్లాలో నిన్నటి నా పర్యటన. మా పార్టీకి చెందని ఉప సర్పంచ్ వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకుంటే, నేను పరామర్శకు వెళ్లాను. దానిపై నాగమల్లేశ్వరరావు కోర్టు నుంచి ఆదేశాలు తెచ్చినా, కేసు నమోదు చేయలేదు. నేను వారిని పరామర్శించడం కోసం వెళ్లడం తప్పా? వారు మా పార్టీ నాయకులు. నేను అక్కడికి పోకుండా కర్ఫ్యూ పరిస్థితి తీసుకురావడం తప్పు కాదా? నేను వెళ్లిన ఇంటి యజమానిపై కేసు పెట్టడం తప్పు కాదా? ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం. ఇంతకన్నా ఘోరం మరొకటి ఉండదు.

ఎవరు ఆ సమస్య సృష్టిస్తున్నారు?

నా పర్యటనలో శాంతి భద్రతల సమస్య ఎవరు సృష్టిస్తున్నారు. రైతుల దగ్గరకు పోయాను. పరామర్శించాను. అందులో తప్పేమిటి?

నన్ను అడ్డుకోవాలని చూడడం ఎందుకు? ఎందరు రావాలో చెప్పడానికి నువ్వు ఎవరు? నన్ను చూడడానికి ప్రజలు రాకుండా అడ్డుకోవడం ఎందుకు? వారికి భోజనం పెడుతున్నావా?

నా అభిమానులు. నా పార్టీ కార్యకర్తలు వస్తే, నీకేం బాధ? నేను సమస్యలపై పోరాటం మొదలు పెట్టేవరకు ఆయన స్పందించడం లేదు. రైతుల దగ్గరకు నేను వెళ్తేనే కదా, ఆయన స్పందించలేదు. నేను రైతులను పరామర్శిస్తే, మీకేం బాధ?

అసలు నీవు సమస్యలు పరిష్కరిస్తే, నేను వెళ్లాల్సిన అవసరం ఏముంది?

ఆ అబ్బాయి టీడీపీ సభ్యుడు

నిన్నటి పోస్టర్ల ప్రస్తావన. అది పుష్ప సినిమా డైలాగ్. అది పెట్టినా తప్పేనా? ఆ ఫ్లెక్సీ పెట్టిన యువకుడు టీడీపీ సభ్యుడు. ఆయనకు సభ్యత్వం కూడా ఉంది. అంటే, టీడీపీకి చెందిన వ్యక్తి, యువకుడికి కూడా చంద్రబాబుపై కోపం వచ్చింది. అందుకే రప్పా రప్పా కోస్తాను అన్నాడు. ఏ పథకాలు లేవు. అంతా మోసం. అందుకే టీడీపీ వారిపై ఆక్రోషం చూపుతూ ఫోటోలు, ఫ్లెక్సీల ప్రదర్శన. టీడీపీ కార్యకర్త, సభ్యుడు.. మన కార్యక్రమంలో పాల్గొని, టీడీపీ వారినే రప్పా, రప్పా నరుకుతా అన్నాడు' అని వైఎస్ జగన్ పేర్కొన్నారు.

## ఏడాదిలో సాధించిన విజయాలు..



**అమరావతి:** ఏడాది పాలన, అభివృద్ధిపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రగతి నివేదిక పేరుతో లేఖ విడుదల చేశారు. ఏడాది క్రితం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీయే కూటమి విజయానికి అండగా నిలిచి, రాష్ట్రాన్ని బానిస సంకెళ్ల నుంచి విముక్తి చేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. 2019 నుంచి 2024 వరకు రాష్ట్రం నియంతృత్వ పాలకుల పాలనలో నలిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధికి దూరమై శాంతిభద్రతలు క్షీణించి, యువత భవిష్యత్తుపై నీలి మేఘాలు కమ్ముకొని, మహిళలకు రక్షణ కరువై.. రాజధాని నిర్మాణం ఆగిపోయిన సమయంలో ప్రజలు కూటమికి అధికారం కట్టబెట్టారన్నారు. రాష్ట్రాన్ని రక్షించేందుకు, ప్రజాస్వామ్య పాలన పునరుద్ధరించేందుకు ప్రధాని మోదీ, సుదీర్ఘ రాజకీయం అనుభవం కలిగిన నాయకుడు, సీఎం చంద్రబాబు సారథ్యంలో పోటీ చేశామని, అందరి సమష్టి సహకారంతో ఎన్డీయే కూటమి 164 అసెంబ్లీ సీట్లు గెలిచి 94శాతం స్ట్రైక్ రేట్‌తో చారిత్రాత్మక విజయం సాధించిందని గుర్తు చేశారు. ఇంతటి గెలుపును అందించిన ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు, రాష్ట్రాన్ని అభివృద్ధి బాట పట్టించేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని వివరించారు. గత ఐదేళ్లలో జరగని అభివృద్ధిని.. ఏడాది కాలంలోనే చేసి చూపిస్తూ, ప్రజలతో పాటు, పెట్టుబడిదారుల్లో విశ్వాసాన్ని నింపడానికి కృషి చేశామన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని, సుపరిపాలనను చూసి నేడు కేంద్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారాలు అందిస్తుండటంతో రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుకు వెళ్తోందని తెలిపారు. స్వర్ణాంధ్ర 2047 సాధించే దిశగా అడుగులు వేస్తున్నామని పేర్కొన్నారు. రాజకీయాల్లో, ప్రభుత్వంలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని పరితపించే వ్యక్తిగా.. ఏడాది కాలంలో తన శాఖల ద్వారా చేసిన అభివృద్ధిని, సాధించిన విజయాలను ప్రజల ముందు ఉంచుతున్నట్లు తెలిపారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖ, పర్యావరణ, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖల ద్వారా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల సమగ్ర నివేదికను ప్రజలందరూ నిశితంగా పరిశీలించి ఎన్డీఏ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని గుర్తించాలని కోరారు. రాబోయే నాలుగేళ్లలో ఇంతకు రెట్టింపు అభివృద్ధి చేపట్టి రాష్ట్రాన్ని అభివృద్ధికి చిరునామాగా మారుస్తామని, దేశంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర అభివృద్ధికి అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన ప్రతి కార్యక్రమాన్ని ప్రజలకు చేరవేసేందుకు కృషి చేస్తున్న ఉన్నతాధికారులు, ఉద్యోగులను అభినందించారు.

## దొంగలు ఎక్కడైనా దొంగతనం చేశామని ఒప్పుకొంటారా?



**శ్రీకాకుళం:** వైవీ సుబ్బారెడ్డి వద్ద ట్యాప్ అయిన తన ఆడియో ఉందని, ఇది నిజమో కాదో.. వైవీ సుబ్బారెడ్డి అతని కుటుంబసభ్యుల మీద ప్రమాణం చేసి నిజం చెప్పాలని ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. వైవీ చేతికి ఆ ఆడియో ఎలా వచ్చిందో విచారణకు పిలిచి ప్రశ్నించాలని, ట్యాపింగ్‌లో నిజాలు నిగ్గు తేల్చాలన్నారు. ఫోన్ ట్యాపింగ్ అంశంపై ఆమె శ్రీకాకుళంలో మీడియాతో మాట్లాడారు. "కేసీఆర్, జగన్ ఆనాడు నీచ రాజకీయాలు చేశారు. అందులో భాగంగానే ఫోన్ ట్యాపింగ్ చేశారు. నేను ఆర్థికంగా, రాజకీయంగా ఎదగకూడదని నాపై నిఘా పెట్టారు. నేను ఎవరిని కలుస్తున్నానో గ్రహించి నాకు మద్దతు ఇవ్వకుండా పెద్ద పెద్ద నాయకులను ఆపేశారు. ఇదంతా ఫోన్ ట్యాపింగ్ చేసి జరిపిన కుట్రనే. సుబ్బారెడ్డి చేతిలో నా ఆడియో ఉంది. స్వయంగా నేనే విన్నా. ఆస్తుల విషయంలో కుట్రలు పన్ని సుబ్బారెడ్డితో జగన్ అబద్ధాలు చెప్పించారు. రెండు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు మారాయి కాబట్టి ఫోన్ ట్యాపింగ్ విషయం వెలుగులోకి వచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వంలో విచారణ జరుగుతోంది. చంద్రబాబుకి అనుకూలంగా మాట్లాల్సిన అవసరం నాకు లేదు. జగన్ తీరు అలీబాబా 40 దొంగల మాదిరిగా ఉంది. ఇంత చేసిన జగన్‌కు ఫోన్ ట్యాపింగ్‌తో సంబంధం లేదు అంటే ఎలా? దొంగలు ఎక్కడైనా దొంగతనం చేశామని ఒప్పుకొంటారా? ఫోన్ ట్యాపింగ్ కేసులో సుబ్బారెడ్డిని కూడా పిలిచి విచారణ జరపాలి. ఫోన్ ట్యాపింగ్ నా వ్యక్తిగత స్వేచ్ఛను ఉల్లంఘించడమే అవుతుంది. నా ఫోన్ మాత్రమే అని భావించాను.. వందల మంది ఫోన్లు ట్యాప్ అయ్యాయని ఇప్పుడే తెలుస్తుంది. అందరికీ న్యాయం జరగాలి"అని షర్మిల అన్నారు.

## బనకచర్ల చుట్టూ రాజకీయం

-మొదటిపేజీ తరువాయి



బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణం - పర్యావరణ ప్రభావంపై ప్రాథమికంగా చర్చించింది. ఈ ప్రాజెక్టుకు మంజూరు చేయాలని ఏపీ ప్రభుత్వం విజ్ఞప్తి చేస్తోంది. ఈ అనుమతుల కోసం ఏపీ ప్రభుత్వం తీవ్రంగా కసరత్తు చేస్తోంది. అంతే కాకుండా, ఈ ప్రాజెక్టుకు నిధుల సమీకరణ కోసం జలహారతి కార్పొరేషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది.పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు అనేది గోదావరి-కృష్ణా-పెన్న నదులను అనుసంధానం చేసే ప్రణాళిక. గోదావరి నీటిని పెన్నా బేసిన్‌కు తరలించడం ముఖ్య లక్ష్యం. మూడు దశలుగా బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టనున్నారు. పోలవరం నుండి కృష్ణా నది వరకు తొలి దశగా, కృష్ణా నది నుంచి బొల్లపల్లి రిజర్వాయర్ వరకు రెండో దశగా, బొల్లపల్లి రిజర్వాయర్ నుంచి బనకచర్ల రెగ్యులేటర్ వరకు మూడో దశగా నిర్మాణాన్ని చేపట్టేలా ఏపీ ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇలా గోదావరి వరద జలాలను గోదావరి బేసిన్ నుంచి పెన్నా బేసిన్‌కు తరలించి రాయలసీమ, ప్రకాశం, నెల్లూరు జిల్లాలలో వినియోగించడం ఈ ప్రాజెక్టు లక్ష్యం.బనకచర్ల కరువు పీడిత రాయలసీమకు పునరుజ్జీవం కల్పించే ప్రాజెక్టు. 2027 నాటికి ఈ ప్రాజెక్టు పూర్తి చేయాలని ఏపీ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఏపీలో జలవనరులు మరింత పెరుగుతాయి. తద్వారా కలిగే నీటి సమృద్ధి వల్ల వ్యవసాయ రంగంలో ఏపీ విప్లవాత్మకమైన అభివృద్ధి సాధించే వీలుంటుంది. ఏపీ స్థూల దేశీయోత్పత్తి పెరుగుతుంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలు బలోపేతం అవుతాయి. వలసలు తగ్గి ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయి. వ్యవసాయ రంగానికి మాత్రమే కాకుండా పారిశ్రామిక అవసరాలకు ఈ ప్రాజెక్టు నీటిని వినియోగించనున్నారు. తద్వారా పారిశ్రామిక రంగం అభివృద్ధి దిశగా పయనిస్తుంది. మొత్తం మీద ఏపీ సమగ్రాభివృద్ధికి బనకచర్ల ప్రాజెక్టు కీలకం అని చెప్పాలి

# జగన్ హయాంలో ఎన్నో అరాచకాలు...

-మొదటిపేజీ తరువాయి

చేయాల్సిన పరిస్థితి వచ్చిందని అన్నారు. తాము ఎవరినీ టార్గెట్ చేయడం లేదు.. చట్టం తన పని తాను చేసుకుపోతుందని స్పష్టం చేశారు. రౌడీయిజం చేసేవారిని, చట్టాన్ని ఉల్లంఘించేవారిని వదిలేయాలా అని నిలదీశారు. ఒక్కసారి ఉన్మాదులుగా మారితే వారిని మార్చగలమా అన్నారు. భవిష్యత్‌ను తీర్చిదిద్దే నాయకుల గురించి ప్రజలు ఆలోచించాలని కోరారు సీఎం చంద్రబాబు.

**ఇప్పుడు రఫ్ఫా రఫ్ఫా అంటున్నారు..**

'కొందరికి క్రైమ్ కూడా అలవాటు అయిపోయింది. అంతా యోగా చేస్తే పబ్లిక్ అటెన్షన్ డైవర్ట్ చేయాలని ఇలాంటివి చేస్తున్నారు. ఇప్పుడు రఫ్ఫా రఫ్ఫా అంటున్నారు. గంగమ్మ జాతరలో పొట్టేలు నరికినట్లుగా నరికేస్తాం అంటున్నారు. ఒకప్పుడు చెడ్డ లక్షణాలు ఉన్న వ్యక్తిని రాజకీయాల్లో దూరం పెట్టేవారు. ఇప్పుడు వారినే వెనకేసుకుని తిరుగుతున్నారు. మేము ఎప్పుడైనా పోలీసులు వద్దంటే నిబంధనలకు విరుద్ధంగా వెళ్లామా. గంజాయి, బెట్టింగ్ బ్యాచ్, అత్యాచారాలు చేసే వారికి విగ్రహాలు పెడుతున్నారు. ఏపీలో గంజాయి చాలా వరకు కంట్రోల్ చేశాం. గంజాయి, డ్రగ్స్ అరికట్టడానికి ఈగల్ టీం ఏర్పాటు చేశాం' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

**జగన్ హయాంలో ఎన్నో అరాచకాలు...**

'గత జగన్ ప్రభుత్వ హయాంలో ఎన్నో అరాచకాలు జరిగాయి. తాను చేసిందే చట్టం అంటే ఎలా కుదురుతుంది. మీరు మారాలి.. లేకుంటే ప్రజలు మార్చాలి. వైసీపీ నేతలు సమాజానికే పెద్ద సమస్యగా మారిపోయారు. అన్ని నేరాల్లో వాళ్లే ఉంటున్నారు.. మళ్లీ రాజకీయం చేస్తున్నారు. ప్రశాంతంగా ఉండే కుప్పంలో అలజడి సృష్టించే ప్రయత్నం చేస్తున్నారు. తప్పుడు పనులతో అతలాకుతలం చేస్తామంటే సరికాదు. ఏడాది క్రితం చనిపోయిన వ్యక్తికి ఇప్పుడు పరామర్శా. వైసీపీ హయాంలోనే నాగమల్లేశ్వరరావు చనిపోయాడు. వైసీపీ నేతల వాహనం ఢీకొని చనిపోతే పట్టించుకోరా. రౌడీయిజం చేయాలని అందరినీ ప్రోత్సహిస్తున్నారు' అని సీఎం చంద్రబాబు ప్రశ్నల వర్షం కురిపించారు.

**మేము ఎందుకు భయపడతాం..**

'ఏపీ మొత్తం ఒక మంచి పని చేస్తే వైసీపీ నేతలు మాత్రం నేరాలకు పాల్పడుతున్నారు. నేరస్థుల మెంటాలిటీ అలానే ఉంటుంది. ఇష్టానుసారం వ్యవహరిస్తే చట్టం ఊరుకోదు. విచిత్రమైన మనస్తత్వం ఉన్నవాళ్లు అలా మాట్లాడుతారు. ఆయన చేసిన పనులను చూసి జనం ఆ తీర్పు ఇచ్చారు. జగన్‌కు సత్తెనపల్లి పర్యటన నిమిత్తం 3 కార్లు, 100 మంది జనానికి మాత్రమే ఏపీ పోలీసులు అనుమతి ఇచ్చారు. అంతకంటే ఎక్కువమంది ఎలా వెళ్లారు. మేం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాకు అనుమతులు ఇచ్చారా. 2029లో ఎన్నికలు ఉంటాయి.. ఇప్పుడు నీ వెంట వచ్చిన జనాన్ని చూసి మేము ఎందుకు భయపడతాం. అప్పటికీ నీ ఆటలు ఎలా సాగుతాయనేది చూస్తాం. మీ భవిష్యత్తును తీర్చిదిద్దే నాయకుడి విషయంలో జాగ్రత్తగా ఉండాలి. రాష్ట్ర నాయకుడిని ఎన్నుకునేటప్పుడు ఎంత జాగ్రత్తగా ఉండాలి. ప్రజలు అడిగితే మేము సమాధానం చెబుతాం. కానీ మా నేతలను వైసీపీ శ్రేణులు నిలదీస్తే తాట తీస్తాను .. ఇందులో సందేహం లేదు. నీ వాహనాలు ఢీ కొట్టి ఒకరు చనిపోతే ఎందుకు పరామర్శించవు. బెట్టింగ్ ప్రాణానికి ఉన్న విలువ నీ వాహనం ఢీకొట్టి చనిపోయిన వారి ప్రాణానికి లేదా. నన్ను, వైజాగ్, తిరుపతిలో ఆపితే నేను దౌర్జన్యం చేశానా. 40 వేల మందిని పొదిలిలో ఎందుకు పోగేశావ్. నువ్వు పొగాకు వేలం కేంద్రానికి 40 వేల మందిని ఎలా తీసుకెళ్తావు. కుప్పంలో జరిగిన సంఘటనకు నేను సిగ్గు పడుతున్నాను. శాంతి భద్రతలు ప్రభుత్వానికి చాలా ముఖ్యం. చంపడం కూడా సినిమాల్లో చూపిస్తారు... వాటిని చూసి నేను బయట చంపుతానంటే ఎలా అని' సీఎం చంద్రబాబు ప్రశ్నించారు.

# విశాఖకు ఇంటర్నేషనల్ బ్రాండ్...

**విశాఖపట్టణం :** అంతర్జాతీయ స్థాయిలో మరోసారి విశాఖపట్నం మార్మోగ నుంది. ఈనెల 21న ప్రపంచ యోగా దినోత్సవ వేడుకలు విశాఖలో జరగనున్నాయి. ప్రధాని నరేంద్ర మోడీ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఐదు లక్షల మందితో యోగా దినోత్సవ వేడుకలు జరిపేందుకు కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసింది. ఇప్పటికే విశాఖ సిటీ పర్యాటకంగా గుర్తింపు పొందింది. వాణిజ్యపరంగా అభివృద్ధి సాధిస్తోంది. ఆసియా ఖండంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న మెగాసిటీగా గుర్తింపు సాధించింది. అందుకే సిటీ ఆఫ్ డెస్టినీ గా పేర్కొంటారు. ఇక టూరిజం అంటే విశాఖ అని అంతర్జాతీయ పర్యాటకులు భావిస్తారు. అటువంటి చోట ప్రపంచ యోగా దినోత్సవ వేడుకలు జరుపుతుండడంతో.. మరోసారి అంతర్జాతీయ స్థాయిలో విశాఖ చర్చకు దారితీస్తోంది.యోగాకు ప్రపంచ గుర్తింపు తీసుకొచ్చింది భారత్. అందుకే యోగా విశిష్టతను ప్రపంచానికి చాటి చెప్పేందుకు ఏటా ఈ దినోత్సవాన్ని జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో ప్రధాని నరేంద్ర మోడీ ఈసారి విశాఖలో జరిగే వేడుకలకు హాజరవుతానని ముందుగానే ప్రకటించారు. అమరావతి రాజధాని పునర్నిర్మాణ పనుల ప్రారంభోత్సవానికి విచ్చేసిన మోడీ.. ప్రపంచ యోగా దినోత్సవ వేడుకలకు సాగర తీరానికి వస్తానని రాష్ట్ర ప్రభుత్వానికి ఆఫర్ ఇచ్చారు. ఇది ఒక విధంగా చెప్పాలంటే విశాఖ అభివృద్ధికి అడుగులు పడినట్టే. ఇప్పటికే ప్రపంచ దిగ్గజ ఐటీ సంస్థలు విశాఖకు క్యూ కడుతున్నాయి. ఇంకోవైపు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు పెద్ద ఎత్తున ఏర్పాటు అవుతున్నాయి. ఆర్థిక రాజధానిగా విశాఖ మారుతున్న క్రమంలో ఇటువంటి అంతర్జాతీయ వేడుకలకు వేదికగా నిలవడం శుభపరిణామం.ప్రధాని విశాఖ పర్యటనక సంబంధించి షెడ్యూల్ ముందుగానే ఖరారు అయింది. ప్రధానమంత్రి కార్యాలయం నుంచి ప్రత్యేక ప్రకటన వచ్చింది. ఈనెల 20న ప్రధాని నరేంద్ర మోడీ భువనేశ్వర్ నుంచి విశాఖకు చేరుకోనున్నారు. ఆ రాత్రికి అక్కడే బస చేస్తారు. ఆ తరువాత రోజు ఉదయం 6:30 గంటలకు విశాఖ బీచ్ రోడ్ లో యోగా దినోత్సవ వేడుకల్లో పాల్గొనున్నారు. అదేరోజు మధ్యాహ్నం ప్రత్యేక విమానంలో విశాఖ నుంచి ఢిల్లీకి బయలుదేరి వెళ్తారు.ప్రధాని మోదీ పర్యటన నేపథ్యంలో విశాఖకు ప్రముఖుల తాకిడి పెరిగింది. ఇప్పటికే ఏర్పాట్లను సీఎం చంద్రబాబు సమీక్షించారు. ఆయన ఈనెల 20న విశాఖకు చేరుకుంటారు. ప్రధాని నరేంద్ర మోడీకి స్వాగతం పలకనున్నారు. ప్రస్తుతం ఢిల్లీ పర్యటనలో ఉన్న మంత్రి నారా లోకేష్ నేరుగా విశాఖకు చేరుకుంటారు. కేంద్ర మంత్రులతో పాటు రాష్ట్ర మంత్రులు కూడా పెద్ద ఎత్తున హాజరవుతారు. ఒకరోజు ముందుగానే విశాఖ నగరం భద్రత వలయంలోకి వెళ్తుంది. ఇప్పటికే నగరం నిఘా నీడలో ఉంది. మొత్తానికైతే విశాఖకు అంతర్జాతీయ ఖ్యాతి రావడం పై నగరవాసులతోపాటు ఉత్తరాంధ్ర ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# ఘనంగా రాహుల్ గాంధీ 54వ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్న కాంగ్రెస్ పార్టీ నేతలు



**జూన్ 19 తిరుపతి జిల్లా ప్రతినిధి (ప్రజాజ్యోతి)** ఏఐసీసీ మాజీ అధ్యక్షులు, భారతదేశ పార్లమెంట్ లో ప్రతిపక్ష నేత శ్రీ రాహుల్ గాంధీ గారి 54వ జన్మదిన వేడుకలను తిరుపతి నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గౌడపేరు చిట్టబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గురువారం స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం ఎదుట ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద కేక్ కట్ చేసి రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈసందర్భంగా గౌడపేరు చిట్టబాబు మాట్లాడుతూ భారతదేశ సమగ్ర అభివృద్ధికి రాహుల్ గాంధీ నాయకత్వం ఎంతైనా అవసరమని అన్నారు. జీవితంలో ఊహించని ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని మేరు శిఖరంలా నిలబడ్డారని కొనియాడారు. దేశ సమగ్రత, సమైక్యతతో పాటుగా సంక్షేమం అభివృద్ధి ఫలాలు పేద, బడుగు, బలహీన వర్గాలకు అందాలంటే అది రాహుల్ గాంధీ తోనే సాధ్యమవుతుందన్నారు. శ్రీ వేంకటేశ్వర స్వామి ఆశీస్సులతో ఆయన నిండు నూరేళ్లు దేశ అభ్యున్నతికి ప్రగతికి దోహదపడే శక్తి సామర్థ్యాలు కడిగి ఉండాలని ఆకాంక్షించారు. పీసీసీ ఉపాధ్యక్షుడు దొడ్డారెడ్డి రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ రాహుల్ గాంధీ నాయకత్వానికి దేశ ప్రజలు ముఖ్యంగా మేధావులు, విద్యార్థులు, యువత అండగా నిలవాలని పిలుపునిచ్చారు. లౌకిక భారత దేశంలో మతోన్మాద శక్తులకు స్థానం లేదని స్పష్టం చేశారు. భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకునే దిశగా రాహుల్ గాంధీ చేస్తున్న ప్రయత్నానికి యావత్ ప్రజలు అండగా నిలవాలని తెలియజేశారు. 2024 భారత సార్వత్రిక ఎన్నికలకు ముందు రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర మరియు భారత్ జోడో న్యాయ్ యాత్రలను నిర్వహించి దేశ ప్రజలను ఒక్క తాటిపైకి తెచ్చారని తెలిపారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి తమటం వెంకట నరసింహులు మాట్లాడుతూ 2024 ఎన్నికలలో రాయ్‌బరేలి లోక్‌సభ నియోజకవర్గం నుండి గెలిచి ప్రతిపక్ష నాయకుడిగా నామినేట్ అయ్యారని దేశం కోసం ప్రత్యేకంగా గ్రామీణాభివృద్ధి, విద్య, ఉపాధి మరియు మహిళా సాధికారత వంటి అంశాలపై దృష్టి సారించి ఆదిశగా ప్రజలను చైతన్య వంతం చేస్తున్నారని చెప్పారు. రాజకీయాల్లో యువత భాగస్వామ్యం ప్రాముఖ్యతను నొక్కిచెబుతూ దేశ భవిష్యత్తును రూపొందించడంలో యువతను భాగస్వామ్యం చేస్తున్నారన్నారు. డిసీసీ ఉపాధ్యక్షుడు కళందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకత్వం వహించిన రాహుల్ గాంధీ ఎన్నికల ప్రచారంలో 20 శాతం పేద కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 6,000 చొప్పున హామీ ఇస్తున్న కనీస ఆదాయ హామీ పథకాన్ని ప్రకటించారని తెలిజేశారు. దేశంలో పేదరికాన్ని నిర్మూలించాలన్న కృతనిశ్చయంతో ఉన్నారని ఆయనకు ప్రజలు బాసటగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిసిసి మాజీ కార్యదర్శి సుప్రజ, తిరుపతి నగర కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు పార్థసారధి రెడ్డి, గొడుగు చింతల గోపి, ప్రధాన కార్యదర్శి తలారి గోపీచంద్, శివకుమార్, రెడ్డిపల్లి రమేష్, కార్యదర్శి వెంకటేష్, కార్యనిర్వాహక కార్యదర్శి తవన్ కళ్యాణ్, మైనారిటీ విభాగం అధ్యక్షుడు సలీముల్లా, కార్యవర్గ సభ్యుడు ఎం వాసు, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు శివ బాలాజీ, తిరుపతి జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రేమ్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని


# మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు రిలే నిరాహార దీక్ష

దీక్షకు మద్దతు తెలిపిన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కేఎల్ స్వామిదాస్ మాదిగ



**గుంతకల్లు జూన్ 19 (ప్రజా జ్యోతి):** మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం పనిచేస్తున్న కార్మికులు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని మున్సిపల్ కార్యాలయం ముందు మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు.ఈ దీక్షకు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కేఎల్ స్వామి దాస్ మాదిగ, ఆంధ్రప్రదేశ్ సంచర జాతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి వై. శ్రీనివాసులు దీక్షా శిబిరం వద్దకు చేరుకొని తమ మద్దతును తెలియజేశారు. ఈ సందర్భంగా స్వామిదాస్ మాదిగ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సమస్యల పట్ల కార్మికుల బాగోగుల పట్ల నిర్లక్ష్యం వహించడం సిగ్గుచేటు,కార్మికులకు సమాన పనికి సమాన వేతనం తక్షణమే చెల్లించాలని,ఇంజనీరింగ్ విభాగం కార్మికుల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో కార్మిక సంఘాలను,ప్రజాసంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చుడుతామని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయడమైనది.ఈ దీక్షలకు పౌర హక్కుల సంఘం అనంతపురం జిల్లా నాయకులు వి.ఆదినారాయణ,గుంతకల్లు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం.మహేంద్ర, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ఫిరోజ్ ఖాన్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆలం నవాజ్, ఎస్సీ ఎస్టీ జేఏసీ గుంతకల్ పట్టణ కార్యదర్శి జన్నే మస్తానయ్య,అంబేద్కర్ ధర్మ పోరాట సమితి నాయకులు వినోద్ కుమార్, మాతయ్య, వైఎస్ఆర్సిపి ఎస్సీ సెల్ నాయకులు వీరేష్ కుమార్,కెవిపిఎస్ నాయకులు మద్దిలేటి,ఎమ్మార్పీఎస్ గుంతకల్లు మండల ఉపాధ్యక్షులు జయరాం మాదిగ,బాబు మాదిగ, డేనియల్ మాదిగ,రామచంద్ర మాదిగ తదితరులు దీక్షలు చేస్తున్నటువంటి మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగ కార్మిక లకు వేతనం పెంచాలని చేస్తున్నటువంటి రిలే దీక్షలకు సంపూర్ణ మద్దతు తెలియజే యడం జరిగింది.

# విప్లవకారుడు గయా ప్రసాద్



ఎందరో వీరుల త్యాగఫలం మనం నేడు అనుభవిస్తున్న స్వాతంత్ర్యం. భారత దేశ స్వాతంత్ర పోరాటంలో ఎంతోమంది విప్లవ వీరులు మరిచి పోలేని, వెల కట్టలేని త్యాగాలు చేశారు. ఆలాంటి వారిలో భారతీయ స్వాతంత్ర్య సమరంలో చురుకుగా పాలుపంచుకున్న భారతీయ విప్లవకారుడు గయా ప్రసాద్ ఎన్నదగిన వాడు. ఆయన గురించి నేటి తరానికి పెద్దగా తెలియక పోవడం శోచనీ యం. గయాప్రసాద్ కటియార్ (20 జూన్ 1900 10 ఫిబ్రవరి 1993) "హిందుస్థాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్"కు చెందిన విప్లవ వీరుడు. ఆయన 1900, జూన్ 20వ తేదీన నందరాణి, మౌజీరామ్ దంపతులకు కాన్పూర్ జిల్లా బిల్హౌర్ తాలూకా జగదీష్ పూర్ గ్రామంలో జన్మించాడు. ఉన్నత పాఠశాల విద్య తర్వాత ఇతడు కాన్పూర్లో మెడిసినల్ ప్రాక్టీస్ కోర్సులో చేరాడు. తర్వాత ఆర్య సమాజంలో చేరాడు. హిందుస్థాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసి యేషన్ (హెచ్.ఆర్.ఎస్.ఎ)కు చెందిన ఇతర విప్లవ కారుల వలె ఆయన కూడా 1921లో సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొన్నాడు. 1926లో భగత్ సింగ్, రాజ్ గురులు హోళీ పండగ సందర్భంగా జగదీషాపూర్ వచ్చినప్పుడు వారితో ఆయనకు గట్టి అనుబంధం ఏర్పడింది. ఆయన విప్లవ పార్టీ బాంబులు తయారీ కారులకు చోటు కల్పించడం ముఖ్య మైన చర్యగా ఉండేది. ఆయన ఒక మారుపేరుతో వైద్య శాలను ప్రారంభించేవాడు. ఇతర విప్లవ కారులు ఆయన వైద్యశాలలో పనివారుగా నటించేవారు. ఆ వైద్యశాలలో రహస్యంగా బాంబులు తయారటయ్యేవి. ఆ సందర్భంగా రసాయనాల నుండి వచ్చే వాసనను మందులు తయారు చేయడంవల్ల వచ్చిందిగా చుట్టుపక్కల వారు భావించేవారు. డాక్టర్ బి.ఎస్.నిగం అనే మారు పేరుతో ఆయన ఫిరోజ్పూర్లోని తూరి బజార్లో 1928 ఆగస్ట్ 10 నుండి, 1929 ఫిబ్రవరి 9 వరకూ ఒక ఆసుపత్రి ముసుగులో బాంబుల కారా?నా నడిపాడు. దీనిలో శివ్ వర్మ అనే విప్లవకారుడు రామానారాయణ్ కపూర్ పేరుతో, మహావీర్ సింగ్ ప్రతాప్ సింగ్ పేరుతో, చంద్రశేఖర్ ఆజాద్ పండిత్ జీ పేరుతో, సుఖదేవ్ బలే జర్ పేరుతో, జయదేవ్ అనే విప్లవకారుడు గోపాల్ అనే మారు పేరుతో పనిచేసేవారు. పోలీసుల నిఘా చర్యలు అధికం కావడంతో తమ స్థావరాన్ని పరహస్పూరు మార్చారు. ఇన్ఫార్మర్ అయిన ఫిరోజ్పూర్ నివాసి కాలూరాం అనే మంగలి స్వంతపని మీద షరహన్పూర్ వచ్చి అక్కడ డాక్టర్ నిగమ్ టను చూసి, గయా ప్రసాద్ గుర్తించి స్థానిక పోలీసులకు ఈ విషయం తెలియ జేశాడు. 1929, మే 13న పోలీ సులు చౌబే పరి ష్ ప్రాంతంలోని వీరి స్థావరంపై దాడి చేసి శివ్ వర్మ, జయదేవ్ కపూర్లను అరెస్ట్ చేశారు. కాన్పూరుకు వెళ్ళిన గయాప్రసాద్ నిధులు సమకూర్చుకోలేక 1929 మే 15న షహ రన్ పూర్కు తిరిగి వచ్చాటడ. అయితే పోలీసులు చుట్టుముట్టి క్షణాలలో ఆయన చేతికి బేడీలు తగిలించారు. ఆయనను పోలీస్ స్టేషన్కు తరలించే సమయంలో గయాప్రసాద్ తన జేబులోని ఒక కాగితంలో కాకోరీ కుట్ర కేసులో నిందితులు తరఫున వాదించిన లక్నో న్యాయ వాదులు చంద్రభాను గుప్త, మోహన్లాల్ సక్సేనాల పేర్లు ఉండటాన్ని గుర్తు చేసుకుని ఆ కాగితాన్ని ఉండ చుట్టుకుని నోటిలో పెట్టుకుని మ్రింగడానికి ప్రయత్నించాడు. అది గొంతులో అడ్డం పడి విపరీతంగా దగ్గు వచ్చింది. నీరు కావాలని కానిస్టేబులు సంజ్ఞ చేసి నీటితో పాటు ఆ కాగితాన్ని మ్రింగివేశాడు. ఆయనను ఇతర హెచ్.ఆర్.ఎస్.ఎ విప్లవకారులతో కలిపి లాహోర్ తరలించారు. అక్కడ ఆయన నిరాహారదీక్ష చేపట్టాడు. లాహోర్ కుట్ర కేసులో విచారించి జీవిత ఖైదును విధించి అండమాన్ సెల్యులార్ జైలుకు తరలించారు. ఆ జైలులో ఖైదీల పట్ల చూపుతున్న అమానవీయ చర్యలకు నిరసనగా ఆయన అక్కడ కూడా 46 రోజుల పాటు నిరాహారదీక్ష చేశాడు. ఆయన హెచ్.ఆర్.ఎస్.ఎ. సహచరుడు మహావీర్ సింగ్ ఈ సమ్మెలో మరణించాడు. దానితో ఆయనను ఆ జైలు నుండి తరలించారు. మళ్ళీ 1937లో ఆయనను సెల్యులార్ జైలుకు పంపారు. చివరకు 1946లో విడుదల చేశారు. స్వాతంత్ర్యానంతరం కూడా తన విప్లవ ధోరణితో రైతుల, కార్మికుల పక్షాన పోరాడాడు. ఫలితంగా 1958లో 6 నెలలపాటు, మళ్ళీ 1966-68లో ఒకటిన్నర సంవత్సరాలు జైలు జీవితం గడిపాడు. ఆయన 1993, ఫిబ్రవరి 10వ తేదీన మరణించాడు. ఆయన జ్ఞాపకార్థం 2016, డిసెంబర్ 26వ తేదీన భారత తపాలాశాఖ ఒక స్మారక తపాలాబిళ్ళను, ఫస్ట్ డే కవర్‌ను విడుదల చేసింది.2002లో విడుదలైన "ది లెజెండ్ ఆఫ్ భగత్ సింగ్" అనే సినిమాలో ఆయన పాత్రను నీరజ్ షా పోషించాడు.

## అంతర్జాతీయ యోగా దినోత్సవానికి బాపట్లలో విస్తృత ఏర్పాట్లు

10వేల మందితో సూర్యలంక బీచ్‌లో యోగా కార్యక్రమం



**బాపట్ల జూన్ 19 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈ నెల 21న (శనివారం) ఉదయం 6:00 గంటలకు బాపట్ల మండలం సూర్యలంక బీచ్ ప్రాంగణంలో భారీ యోగా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు తెలిపారు.ఈ కార్యక్రమంలో 10వేల మందికి పైగా ప్రజలు పాల్గొన ఉన్నారని చెప్పారు.ఒత్తిడి నుంచి ఉపశమనం పొందాలంటే యోగ సాధన ప్రతి ఒక్కరికి అవసరం. యోగ సాధనతో శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగవుతుంది. యోగా మన పూర్వీకుల నుంచి లభించిన విలువైన సంపద అని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బాపట్ల నియోజకవర్గ ప్రజలు అందరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే కోరారు.

## మాజీ ఎమ్మెల్యే జితేంద్ర గౌడ్ ని మర్యాదపూర్వకంగా కలిసిన గుంతకల్లు మండలం పరిశీలకుడు ఆవుల కృష్ణయ్య



**గుంతకల్లు జూన్ 19 (ప్రజా జ్యోతి):** గురువారం గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే,తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్. జితేంద్ర గౌడ్ ని వారి నివాసం నందు ఏపీ కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ ఆవుల కృష్ణయ్య గుంతకల్లు మండలం సంస్థాగత ఎన్నికల పరిశీలకుని హోదాలో పట్టణానికి విచ్చేసి మర్యాదపూర్వకంగా జితేంద్ర గౌడ్ ని కలవడం జరిగింది.ఈ కార్యక్రమానికి విచ్చేసిన పలువురు సీనియర్ నేతలు పలు సమస్యలపై కృష్ణయ్యకి వివరించగా మీ సమస్యను తెదేపా అధిష్టానానికి మరియు అధినేత చంద్రబాబు,యువనేత లోకేష్ బాబు లకు నివేదిక రూపంలో అందిస్తామని పేర్కొన్నారు. ప్రతిపక్షంలో పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికి తగిన న్యాయం చేకూర్చి, సముచిత స్థానం కల్పించే విధంగా చూస్తామన్నారు.ఈ కార్యక్రమంలో పవన్ గౌడ్, అనిల్ గౌడ్,టీ.కేశప్ప, టీ.సుంకప్ప,రాఘవేంద్ర, ముక్కన్న గారి రామాంజనే యులు, శ్రీరాములు,శివప్ప, సుంకప్ప,బండి లక్ష్మిదేవీ, గిడ్డయ్య,లీలావతి,సంజీవ,టీ.సురేంద్ర గుంతకల్లు మండల, పట్టణ పలువురు తెదేపా శ్రేణులు పాల్గొన్నారు.

## విద్య మాఫియాకు అడ్డుకట్టు వేయాలని అడిగితే ఏఐఎస్ఎఫ్ నాయకుల పైన దాడుల

ఏఐఎస్ఎఫ్ విద్యార్థి నాయకుల పైన దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి

రాష్ట్రవ్యాప్తంగా కార్పొరేట్ విద్యాసంస్థలలో ఫీజుల దోపిడీ అరికట్టాలి

అరెస్టు చేసిన ఏఐఎస్ఎఫ్ నాయకులను తక్షణమే విడుదల చేయాలి

గుంతకల్లు లో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చైతన్య విద్యాసంస్థల దగ్గర ధర్నా




**గుంతకల్లు జులై 19 (ప్రజా జ్యోతి):** రాష్ట్రవ్యాప్తంగా కార్పొరేట్ విద్యాసంస్థలలో ఫీజుల దోపిడి అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విజయవాడలో శ్రీ చైతన్య కళాశాల వద్ద శాంతియుతంగా ఆందోళన చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు పైన దాడి చేసిన పోలీసులను సస్పెండ్ చేయాలని, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీ అరికట్టాలని గురువారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో గుంతకల్లు పట్టణంలో ఉన్నటువంటి చైతన్య విద్యాసంస్థల దగ్గర నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగిం ది.ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ పట్టణ సహాయ కార్యదర్శి ఫర్హాన్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా విద్య మాఫియా ఫీజుల దోపిడీ పుస్తకాల వ్యాపారం అరికట్టా లని విజయవాడ పట్టణంలో శాంతియుతంగా ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలరాజు రాష్ట్ర ఉపాధ్యక్షులు సాయికుమార్ పైన పోలీసులు దాడి చేయడా నికి ఖండించారు.విద్యార్థి నాయకుల పైన దాడి చేసిన పోలీసులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఫీజుల దోపిడీ అరికట్టమని అడిగితే విద్యార్థి నాయకుల పైన దాడులు చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్య లు దాదాపు 90% పైగా ఎన్డీఏ ప్రభుత్వంలో ఉన్నటువంటి ప్రజా ప్రతినిధులవే ఉన్నాయ న్నారు. ఇంకా ప్రభుత్వ విద్యా సంస్థలు ఎక్కడ అభివృద్ధి చెందుతాయని ప్రశ్నించారు. కార్పొరేట్ విద్యాసంస్థలలో రాష్ట్ర ప్రభుత్వం ఫీజు నియంత్ర చట్టాన్ని అమలు చేసి గ్రామీణ ప్రాంతాల్లో పట్టణ ప్రాంతాల్లో ఎంత ఫీజు ఉండాలా దాని ప్రకారమే వసూలు చేసే విధంగా రాష్ట్ర విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చైతన్య విద్యాసంస్థలు మా ప్రభుత్వా నివే నారాయణ విద్యాసంస్థలు మా ప్రభుత్వానివే ఎస్సార్ విద్యాసంస్థలు మా ప్రభుత్వా నివే భాష్యం విద్యాసంస్థలు మా ప్రభుత్వానివే రాష్ట్రంలో ఏ విద్యాసంస్థలు తీసుకున్న కూడా ఎన్డీఏ ప్రభుత్వం లో ఉన్న ప్రజా ప్రతినిధులవే అన్నారు.. ప్రభుత్వ నిబంధన లకు విధంగా పుస్తకాల వ్యాపారం చేయకూడదని ఉన్నప్పటికీ కార్పొరేట్ విద్యాసంస్థలు వేల రూపాయ లకు అమ్ముతున్నారని మండిపడ్డారు. విద్య మాఫియా అరికట్టాలని విద్యాదోపిడి ఆపాలని శాంతియుతంగా ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకుల పైన దాడి చేసి అరెస్టు చేసిన వారిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.దాడి చేసిన ఎస్ఐ శంకర్ కానిస్టేబుల్ వీరులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమా లు చేపడతామని ఈ సందర్భంగా హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ ముస్తఫా,ముత్యర్, అనిల్, ఖదీర్,కుమార్,భాష,మోహన్ నిరంజన్,సాయి తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల విలీనం వద్దు

**ఎస్. టి విద్యార్థులను చదువు దూరం చేయ వద్దు ని కలెక్టర్ కు వినతి**



**జూన్ 19 తిరుపతి జిల్లా ప్రతినిధి (ప్రజాజ్యోతి)** చంద్రగిరి నియోజకవర్గం లోని రామచంద్రపురం మండలం వుండే ప్రసన్న వెంకటేశ్వరపురం పరమాల గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆదర్శ పాఠశాల పేరుతో విలీనం చేసే ఆలోచన విరమించుకోవాలని సిపిఎం, ఎస్ఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా కలెక్టర్ గారికి కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించడం జరిగింది. సమర్పించిన వారిని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎస్ జయచంద్ర, రూరల్ కార్యదర్శి కే సుమన్, ఐద్వా జిల్లా కార్యదర్శి డాక్టర్ పి సాయి లక్ష్మి, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు వినోద్ కుమార్, నగరకార్యదర్శి తేజ తదితరులు కలిసి వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఆర్ సి పురం మండలంలో పివిపురంలో ఉన్న మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలలో బలిజిపల్లి గ్రామంలోని మోడల్ స్కూల్లో విలీనం చేశారు. దీంతో ప్రక్కన ఉన్న రామిరెడ్డిపల్లి, ఎస్టీ కాలనీ గంగమాంబ పురం, పివిపురం గ్రామాల నుంచి విద్యార్థులు రాష్ట్ర రహదారిపై నడిచి వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. దీంతో చుట్టుపక్కల ఉన్న విద్యార్థులు ఆ గ్రామానికి వెళ్లి చదువుకోవాలంటే తీవ్రమైన ఇబ్బందులకు రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. రోడ్డు దాటుతున్న సమయంలో ప్రమాదవశాస్తూ ఏదైనా యాక్సిడెంట్ జరిగితే అవకాశం ఉంది. అదేవిధంగా పివిపురంలో ఉండే మోడల్ స్కూల్ ఏర్పాటు చేయడానికి అనుగుణంగా ఆ పాఠశాల స్థలం మూడున్నర ఎకరా ఉంది. కాబట్టి పివీ పురం లో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలను మోడల్ పాఠశాలగా తీర్చిదిద్దాలని కలెక్టర్ గారికి విన్నవించడం జరిగింది. అదేవిధంగా ఆ స్కూల్లో దాదాపు 40 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఒక ఎస్టీ కాలనీకి సంబంధించిన వారే 22 మంది పిల్లలు పాఠశాలకు వెళు తున్నారు. వీరందరూ పాఠశాలకు దూరమయ్యే అవకాశం ఏర్పడుతుంది. కాబట్టి ప్రభుత్వం పునరాలోచన చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాము...

# యస్వీయూ స్టేడియంలోయోగాంధ్ర కార్యక్రమం





**జూన్ 19 తిరుపతి జిల్లా ప్రతినిధి (ప్రజాజ్యోతి)** శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోజూన్ , 21 వ తేదీన జరుగనున్న యోగాంధ్ర – 2025 కార్యక్రమానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు యస్వీయూ రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశానుసారం , 21 ఉదయం 5.45 గంటల నుంచి 7.15 వరకు యస్వీయూ తారకరామ స్టేడియంలో యోగాంధ్ర కార్యక్రమం జరుగుతుందని, యూనివర్సిటీ నుంచి 3 వేల మంది, తిరుపతి జిల్లా కలెక్టరు వారి పక్షాన 4 వేల మంది , దాదాపు 7 వేల మందితో యోగాంధ్ర కార్యక్రమం కార్యక్రమం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమానికి యస్వీయూ ఉపకులపతి, తిరుపతి జిల్లా కలెక్టర్ , తదితర పరిపాలన యంత్రాంగం హాజరవుతున్నారని, అందరూ ఒకే విధమైన టీ షర్టులు ధరించి, కార్యక్రమంలో పాల్గొంటారని, యస్వీయూ గ్రౌండ్ లో మొత్తం కార్పెట్లతో సిద్ధం చేస్తున్నారని అన్నారు. ఈ యోగా కార్యక్రమంలో నలుగురు ప్రధాన వ్యాయామ నిపుణులు, ఆరు మంది సహాయకులు సిద్ధంగా వున్నారని , విశ్వవిద్యాలయంలో సైన్స్, ఆర్ట్స్, మేనేజ్మెంట్, ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు గత నెల 21 నుంచి శిక్షణ తరగతులు క్యాంపస్ లోని అన్నమయ్య భవన్ ,బాస్కెట్ బాల్ కోర్టు తదితర ప్రాంతాల్లో జరుగుతున్నాయని వివరించారు. ఈ కార్యక్రమం డ్రోన్ కెమెరాల ద్వారా చిత్రీకరించడం జరుగుతుందని, విశ్వవిద్యాలయంలోని ప్రతి విద్యార్థి, ఉద్యోగులు పాల్గొంటారని వారు తెలియజేశారు.

# విద్యుత్ కోతతో ప్రభుత్వ సేవలకు తీవ్ర అంతరాయ

**అనంతగిరి, జూన్.19 ప్రజా జ్యోతి న్యూస్ రిపోర్టర్.శంకర్.** గత ఐదు రోజుల నుండి అనంతగిరి మండల కేంద్రంలో విద్యుత్ అంతరాయం ఏర్పడడంతో సచివాలయం పరిధిలో జరుగుతున్నటువంటి వివిధ సంక్షేమ పథకాలు తల్లికి వందనం ఆన్లైన్ చేయించుకోవటం సుదూర గ్రామాల నుంచి గిరిజనులు సచివాలయం పరిధిలో విద్యుత్ లేకపోవడంతో వేచి ఉంటున్నారు ప్రభుత్వం ఇస్తున్న గడువును సమీపిస్తుండటంతో అనంతగిరి సచివాలయంలో విద్యుత్ కోసం పడి కాపులు కాస్తున్నారు విద్యుత్ శాఖ ప్రత్యేక చర్య తీసుకొని నిరంతరం విద్యుత్ ఉండేటట్టు చర్యలు తీసుకోవాలని అలాగే రాత్రి వేళల్లో కూడా విద్యుత్ తీయడంతో చిన్నపిల్లలు మహిళలు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు తెలుపుతున్నారు ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే ఇక్కడున్న సిబ్బంది ఇష్టం వచ్చినట్లువ్యవహరిస్తున్నారని గిరిజనులు తెలుపుతున్నారు తల్లికి వందనం పథకంలో భాగంగా ప్రభుత్వం ఇస్తున్న గడువు సమీపిస్తుండటంతో సాంకేతిక కారణాలతో నిలిచిపోయిన డబ్బులను మరల గ్రీవెన్స్ ద్వారా దరఖాస్తు పెట్టుకునే వెసులుబాటు ప్రభుత్వం ఇచ్చి ఉన్న సచివాలయాలలో విద్యుత్ లేకపోవడంతో చాలామంది వేచి వేచి నిరాశగా వెనుతిరుగుతున్నారు విద్యుత్ శాఖ సిబ్బంది అలాగే ఆ శాఖ ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ చూపి ఎల్లవేళలా విద్యుత్ ఉండేటట్లు చర్యలు చేపట్టాలని గిరిజనులు కోరుతున్నారు. అలాగే అనంతగిరి సచివాలయంలో ఇంటర్నెట్ కూడా సరిగా పనిచేయకపోవడంతో దానికి సంబంధించిన సచివాలయ సిబ్బంది నిర్లక్ష్య గా వ్యవహరిస్తున్నారని పని వేళల్లో కూడా అందుబాటులో ఉండకపోవడంతో విలువైన సమయాన్ని వృధా అవుతుందని గిరిజనులు తెలుపుతున్నారు మండల పరిషత్




కార్యాలయం పక్కనే ఉన్న ఉన్నతాధికారులు పర్యవేక్షణ లేకపోవడంతోనే ఇలా సిబ్బంది ఇష్టం వచ్చిన?

# పదోతరగతి మండల టాపర్ కు రామరాజు అభినందన పురస్కారం ప్రదానం





**పాతపట్నం జూన్ 19 ప్రజా జ్యోతి న్యూస్..** హిరమండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు తులగాపు కేశవరావు అధ్యక్షతన ,పాతపట్నంనకు చెందిన రామరాజు ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పారశెల్లి రామరాజు ఆధ్వర్యంలో అభినందన కార్యక్రమం జరిగింది. 2024-2025 విద్యా సంవత్సరములులో 10వ తరగతి పబ్లిక్ పరీక్షలలలో హిరమండలం మండలంలో, హిరమండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి టంకాల షర్మిలా పూజిత 582/600 మార్కులు సాధించింది మండల్ టాపర్ గా నిలిచింది. ఈ సందర్భంగా ట్రస్టు తరుపున రామరాజు అభినందన పురస్కారం మరియు నగదు పురస్కారం బహుకరించడం అయినది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు తులగాపు కేశవరావు కి ట్రస్ట్ తరపున ఘనంగా సన్మానం చేయడమైనది, ఆయన మాట్లాడుతూ ఇష్టపడి కష్టపడితే నష్టపోయేది లేదు అంటూ బాగా చదువుకొని ఉన్నత శిఖరాలధిరోహించి దేశానికి మంచి పేరు తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమానికివిముఖ్య అతిథులుగా ఎస్.ఎం.సి .చైర్మన్ సింహాద్రి కళ్యాణి, వైస్ చైర్మన్ గొంటి అప్పయ్య , మాజీ చైర్మన్ జి. సురేష్ , సీనియర్ ఉపాధ్యాయులు కె. జోగారావు, విద్యార్థి తండ్రి టంకాల రామకృష్ణ ,ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం జయప్రదం చేయండి

**ఆర్డీవో చంద్రమోహన్**



**బద్వేల్ జూన్ 19 (ప్రజా జ్యోతి న్యూస్)** స్థానిక పట్టణంలోని రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయంలో గురువారం నాడు ఆర్డీవో చంద్రమోహన్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో చంద్రమోహన్ మాట్లాడుతూ బద్వేల్ పట్టణంలోని మైదుకూరు రోడ్డు ఎస్ బి వి ఆర్ కాలేజీ ఆవరణంలో జూన్ 21న శనివారం ఉదయం 6 గంటలకు జరగబోవు అంతర్జాతీయ యోగా దినోత్సవమునకు ప్రజా ప్రతినిధులు, ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థలు, మేధావులు, వ్యాపారులు, ప్రజలు ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో బద్వేల్ తహసిల్దార్ ఉదయ భాస్కర్, గోపవరం తాహసిల్దార్ త్రిభువన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అనాధ వృద్ధులకు తినుబండారాలు వితరణ



**బద్వేల్ జూన్ 19 (ప్రజా జ్యోతి న్యూస్)** బద్వేల్ పట్టణంలోని ఆసరా కోల్పోయిన అనాధ వృద్ధులకు తమ వంతు సహాయ సహకారాలు ఎల్లవేళల అంద చేస్తామని ముచ్చర్ల సుధాకర్రావు అన్నారు, గురు వారం ఆర్యవైశ్య ప్రముఖులు ముచ్చర్ల సుధాకర్ రావు సతీమణి సుజాత 43,వ వివాహం వార్షికోత్సవ సందర్భంగా బద్వేలు పట్టణంలోని తెలుగు గంగ కాలనీలోని ఆనంద నిలయం నిరాశ్రయుల ఆశ్రమంలోని అనాధ వృద్ధులకు రుచికరమైన భోజనం, స్వీట్లు, తినుబండారాలు, పండ్లు వితరణ కార్యక్రమాన్ని వారి చేతులమీదుగా పలువురికి అందజేయడం జరిగింది, అనంతరం ఆసరా కోల్పోయిన అనాధ వృద్ధులను పలువురిని ప్రేమ ఆప్యాయతగా పలకరించి వారి బాగోగుల గురించి అడిగి తెలుసుకోవడం జరిగింది, ఆసరా కోల్పోయిన అనాధ వృద్ధులకు తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందజేస్తామన్నారు, అనంతరం ఆశ్రమ నిర్వాహకులు పిడతల రవికుమార్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ముచ్చర్ల సుధాకర్ రావు సతీమణి సుజాత ల పెళ్లిరోజు పురస్కరించుకొని ఆశ్రమంలో ఆసర కోల్పోయిన అనాధ వృద్ధులకు భోజనం పండ్లు వితరణ కార్యక్రమాన్ని వితరణ చేయడం సంతోష్కరమన్నారు, వారికి భగవంతుడు ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని వారు తెలియజేస్తూ అనంతరం ముచ్చర్ల సుధాకర్ సుజాత గారికి పలువురు పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో ముచ్చర్ల ప్రవీణ్, రమణ తోపాటు పలువురు పాల్గొన్నారు.

## జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం యోగా విద్యార్థికి రాష్ట్రస్థాయిలో రెండవ బహుమతి

**తిరుపతిజి**



**జూన్ 19, తిరుపతి జిల్లా ప్రతినిధి (ప్రజాజ్యోతి)** తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం, యోగ విజ్ఞాన విభాగానికి చెందిన ఎం.ఎస్సీ యోగా థెరపీ (రెండవ సంవత్సరం) విద్యార్థి రామచంద్ర శ్రీకాంత్ విశ్వవిద్యాలయానికి కీర్తి ప్రతిష్టలు తెచ్చిపెట్టారు. ఆంధ్రప్రదేశ్, ఇబ్రహీంపట్నంలోని డాన్ బాస్కో పాఠశాలలో జూన్ 17, 2025న ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 'యోగాంధ్ర 2025' కార్యక్రమంలో భాగంగా జరిగిన రాష్ట్రస్థాయి యోగా పోటీలలో రామచంద్ర శ్రీకాంత్ రెండవ స్థానం సాధించి అద్భుతమైన విజయాన్ని అందుకున్నారు. ఈ అపురూపమైన విజయానికి గాను విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య జి.ఎస్.ఆర్. కృష్ణమూర్తి , రిజిస్ట్రార్ కె.వి. నారాయణ రావు , యోగ విజ్ఞాన విభాగాధిపతి డా. తపన్ కుమార్ ఘడాయ్ యోగా విభాగానికి చెందిన అధ్యాపకులు మరియు సిబ్బంది తమ ప్రగాఢ సంతోషాన్ని వ్యక్తం చేశారు. శ్రీ రామచంద్ర శ్రీకాంత్‌కు హృదయపూర్వక అభినందనలు మరియు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ ఘనత పట్ల విశ్వవిద్యాలయ సమాజం ఎంతో గర్విస్తోంది మరియు శ్రీకాంత్ తన భవిష్యత్ ప్రయత్నాలలో మరిన్ని విజయాలు సాధించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తోంది.

## పాతపట్నం మండలం తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడి గా పైల బాబ్జి..



**పాతపట్నం జూన్ 19 ప్రజా జ్యోతి న్యూస్..** పాతపట్నం నియోజకవర్గం తెలుగు దేశం పార్టీకి ఆవిర్భావం నుండి కంచు కోట.కాంగ్రెస్ పార్టీ విధానాలు నచ్చక ఆ పార్టీకి వ్యతిరేకము గా పోరాటం చేసే వ్యక్తులలో పైల కుటుంబీకులు ఒకరు, వారి వారసుడు పైల బాబ్జి, తెలుగుదేశం పార్టీ అధికారం ఉన్న, లేకున్నా ఏప్పుడు ఎలాంటి సంక్షోభం ఎదురైన ఆ పార్టీని వీడక పార్టీ లోనే కొనసాగుతున్నారు ఈయన , తెలుగు దేశం పార్టీ మండల అధ్యక్షుని గా రెండవ సారి ఎమ్మెల్యే మామిడి గోవిందరావు సమక్షంలో తెలుగుదేశం కార్యకర్తలు అందరూ కలిసి ఏకవాక్య తీర్మానంతో ఏకగ్రీవంగా ఆయనను ఎన్నుకోవడం జరిగింది,ప్రధాన కార్యదర్శి గా మద్దు రామారావు, వైస్ ప్రెసిడెంట్ శివాల చిన్నయ్య ను ఎన్నుకున్నారు. పైల బాబ్జి సామజిక సేవలతో పాటు ఎవరికి కష్టం వచ్చినా తాను ముందుంటూ సహాయ సహకారాలు అందిస్తూ,టిడిపి పార్టీ శ్రేణులతో మమేకమై, పార్టీ అభివృద్ధి కి అహర్నిశలు శ్రమిస్తు కార్యకర్తల కష్టాల్లో పాలుపంచుకుంటూ,పైల సుబ్బారావు, వారసుడిగా మనవడు పైల బాబ్జి రాజకీయం గా రాణించడం పలువురు హార్షం వ్యక్తం చేస్తున్నారు.

# సచివాలయాల నోడల్ అధికారులే యోగ ఇంచార్జిలు





**పాతపట్నం జూన్ 19 ప్రజా జ్యోతి న్యూస్..** పాతపట్నం మండల పరిషత్ కార్యాలయం లో గురువారం ఎంపిడిఓ చంద్రకళ ఆధ్వర్యంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు గ్రామ రెవెన్యూ అధికారుల తో సమావేశం నిర్వహించారు .తే 21.06.2025 ది నాడు 11 వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆ రోజు మండలం లో గల అన్ని పాఠశాలలు, సచివాలయం ల్లో 162 వేదికల్లో యోగా చేయాలని,జిల్లా కలెక్టరు ఆదేశాలు మేరకు 18 సచివాలయల్లో 18 మందిని నోడల్ అధికారులను నియమించడం జరిగిందని., అలాగే 162 వేదికల్లో యోగా చేయించుటకు ఇంచార్జీలను నియమించడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామాల్లో టామ్ టామ్ వేసి ప్రజలు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు యోగా లో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని కోరడమైనది.అదే రోజు 3 వ శనివారం కనుక స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమం లో భాగంగా అన్ని ప్రదేశాల్లో క్లీన్ అండ్ గ్రీన్ గా ఉంచాలని, మొక్కలు నాటాలని తెలియజేయడమైనది.

# యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి








ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ ,ప్రత్యేక పరిశీలకులు పెదన ఎమ్మెల్యే కాగిత ప్రసాద్ , మార్కా పురం కందుల నారాయణ రెడ్డి

**పొందూరు ,ప్రజా జ్యోతి న్యూస్ :** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 21 వ తేదీన గిన్నిస్ వరల్డ్ రికార్డ్ స్థాయిలో చేసే యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమదాలవలస ఎమ్మెల్యే ,రాష్ట్ర పి.యూ.సి చైర్మెన్ కూన రవికుమార్,ప్రత్యేక పరిశీలకులు పెదన ఎమ్మెల్యే కాగిత ప్రసాద్ , మార్కా పురం కందుల నారాయణ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు పొందూరు మండల కేంద్రంలో ఎంపిడిఓ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో,కూటమి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందన్నారు. పొందూరు మండలానికి సంబంధించి అన్ని శాఖల అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. గ్రామ పంచాయతీలు , సచివాలయాల పరిధిలో విశాఖకు వెళ్ళడానికి పొందూరు మండలానికి 21 బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వేదిక వద్ద వారికి అల్పాహారం తిరుగు ప్రయాణంలో ప్యాక్ చేసిన భోజనం అందించబడునని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోడీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు , డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ హాజరు కానున్నారన్నారు. మండల పార్టీ అధ్యక్షులు చిగిలపల్లి రామ్మోహన్ ,జిల్లా కార్యదర్శి సీపాన శ్రీరంగ నాయకులు,మండల ఉపాధ్యక్షులు బాడాన శేషగిరి, జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బలగ శంకర భాస్కర రావు, మాజీ ఏ.ఎం.సి చైర్మెన్ అన్నెపు రాము పట్టణ పార్టీ అధ్యక్షులు అనకాపల్లి చిన రంగ ,ఎంపీపీ ప్రతినిధి కిల్లి నాగేశ్వర రావు,ఎంపిడిఓ మీసాల మన్మథ రావు ,ఈ. ఓ .పి.ఆర్.డి పొందూరు సింహాచలం,ఆమదాలవలస నియోజకవర్గం పరిశీలకులు ,కూటమి నాయకులు ,సర్పంచులు , ఎంపిటిసిలు ,అధికారులు పాల్గొన్నారు.

# చంద్రబాబు పాలనలో గిరిజన గ్రామాలలో ప్రజలకు రేషన్ కష్టాలు







మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి...

**మెలియాపుట్టి జూన్ 19 ప్రజాజ్యోతి న్యూస్ ..** మెలియాపుట్టి మండలం, గొట్టిపల్లి పంచాయతీలోని చందనగిరి గిరిజన గ్రామాన్ని వైఎస్ఆర్సీపీ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ సభ్యురాలు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి సందర్శించారు. ఎత్తైన కొండలపై ఉన్న ఈ గ్రామంలో గిరిజనుల కష్టాలను నేరుగా తెలుసుకున్నారు. .ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో గిరిజనులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. చందనగిరితో పాటు మరికొన్ని గిరిజన గ్రామాల్లో పర్యటించి, కూటమి ప్రభుత్వం గిరిజనులకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా, వారి హక్కులను కాలరాస్తోందని అన్నారు.గిరిజనులు రేషన్ తెచ్చుకోవడానికి పడుతున్న ఇబ్బందులను బాధగా ఉందన్నారు. చందనగిరి గ్రామంలోని గిరిజనులు రేషన్ కోసం సుమారు ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న నేలబొంతు గ్రామానికి కాలినడకన వెళ్లాల్సి వస్తుందని, ఇది వారికి తీవ్ర ఇబ్బంది కలిగిస్తోందని తెలిపారు. గిరిజనులకు జగనన్న పాలనలో రోడ్డు నిర్మించినందున వారికి జీవనోపాధికి, రవాణా సౌకర్యం కలిగిందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనలో ఇంటి వద్దకే రేషన్ అందించేవారు. కూటమి పాలనలో నిర్వీర్యం చేసినందున ఒక ముసలి అవ్వ కాలి నడకన మెలియాపుట్టి మండలంలోని గొట్టిపల్లి పంచాయతీ చందనగిరి కొండ పై నుండి రేషన్ బియ్యం మోస్తూ అవస్థ పడుతు ఆలినడకని నడుచుకుంటూ వస్తూ ఉన్న దృశ్యాన్ని చూసి చలించి పోయిన వైఎస్ఆర్సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆమెను ఆటో ఎక్కించి పంపించారు.

## ఇదే అనంతగిరి కమ్యూనిటీ హాల్ లోపలి భాగం

దుర్వాసనతో బెంబేలెత్తుతున్న సచివాలయ ఉద్యోగులు.



**అనంతగిరి జూన్ 19. ప్రజా జ్యోతి న్యూస్.రిపోర్టర్.శంకర్.** మండల కేంద్రమైన అనంతగిరిలో సుమారు 15. సంవత్సరాల క్రితం ఐదు లక్షల 50. వేల రూపాయల ప్రభుత్వ నిధులతో స్థానిక ప్రజల అవసరాల నిమిత్తం కమ్యూనిటీ హాల్ నిర్మాణం జరిగింది. కమ్యూనిటీ హాల్ బాధ్యతలు పంచాయితీ శాఖ చూడాల్సి ఉంది అయితే కొంతకాలంగా కమ్యూనిటీ హాల్ నిర్వహణ సక్రమంగా లేకపోవడం వల్ల హాల్ మొత్తము శిధిలాస్థితికి చేరిఉండడంతో ఇప్పుడు ఈ భవనం అసాంఘిక కార్యక్రమాలకు నిలియంగా మారి విపరీతమైన దుర్వాసన వెదజల్లడంతో ప్రక్కనే ఉన్న సచివాలయ ఉద్యోగులు దుర్వాసన భరించలేక. అసాంఘికకార్యక్రమాలు చూడలేక బెంబేలెత్తిపోతున్నారు.శుభకార్యాలకు సమావేశాలకు.ఇతర అత్యవసరాలకు కమ్యూనిటీ హాల్ ఎంతో ఉపయోగకరంగా ఉండేది.కానీనేడు దుస్థితి చూస్తే చాలా బాధాకరంగా ఉందని స్థానికులు వాపోతున్నారు. పంచాయతీ పాలకులు గానీ పంచాయతీ శాఖ అధికారులు గానీ పట్టించుకున్న పాపాన లేకపోవడం వల్ల కమ్యూనిటీ హాల్ కి ఈ పరిస్థితి ఏర్పడిందని విమర్శనాలు వినిపిస్తున్నాయి.

## రితేష్ రెడ్డి చేతుల మీదుగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



**బద్వేల్ జూన్ 19 (ప్రజా జ్యోతి న్యూస్)** గురువారం నాడు స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో యువనేత రితేష్ రెడ్డి చేతుల మీదుగా ముఖ్యమంత్రి సహాయ నిధి (సి ఎం ఆర్ ఎఫ్) క్రింద 32 మంది లబ్ధిదారులకు రూ. 26,85,882 రూపాయలు విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ ప్రజలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆపన్న హస్తం అందిస్తున్నారని, అనారోగ్య సమస్యలతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ రూపంలో సాయం అందిస్తున్నారన్నారు కావున ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పేద ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. లబ్ధిదారులు తమకు అందించిన సహాయానికి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారికి, రితేష్ రెడ్డి గారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కోర్టు విచారణ లో రుజువైన నేరం

నిందితుడికి సంవత్సరం సాధారణ జైలు శిక్ష,రూ. 5000 జరిమానా

**పొందూరు ,ప్రజా జ్యోతి న్యూస్ :** పొందూరు మండలం కింతలి గ్రామానికి చెందిన ప్రకాశ రావు ,అదే గ్రామానికి చెందిన పైడి వెంకట సత్య రమేష్ మధ్య ఇటీవల వివాదం జరిగింది. ఈ ఘటనలో సత్య రమేష్ కత్తి పట్టుకుని దాడి చేసి ,ప్రకాష్ రావు మెడ లో ఉన్న టవల్ తో బిగించి ఊపరి ఆడకుండా చేయడంతో స్పృహ కోల్పోయాడు. దీంతో స్థానిక పొందూరు పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేయగా అసిస్టెంట్ సబ్ ఇనస్పెక్టర్ సువ్వారి రామచంద్ర రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణ లో భాగంగా జూనియర్ సివిల్ జడ్జి కోర్టు బి జ్యోత్స్న విచారించి ఒక సంవత్సరం పాటు సాధారణ జైలు శిక్ష,రూ. 5000 జరిమానా విధించారు. ప్రాసిక్యూషన్ తరపున ఏ.పి.పి రొక్కం శాంతి సంతోషి వాదనలు వినిపించారు.

## జీవన విధానంలో యోగా అంతర్భాగం కావాలనేదే యోగాంధ్ర లక్ష్యం

ఎమ్మెల్యే ఎంజిఆర్...



**పాతపట్నం జూన్ 19 ప్రజా జ్యోతి న్యూస్..** మానోత్సవాల ఐక్యత రాగంతో ప్రజలందరి హృదయాల్లో యోగా ముద్ర. పాతపట్నం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో శాసనసభ్యులు మామిడి గోవిందరావు పాల్గొన్నారు ప్రజారోగ్యమే ప్రధమ లక్ష్యంగా ప్రధానమంత్రి నరేంద్ర మోది, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతుంది పాతపట్నం నియోజకవర్గంలోని ఐదు మండలాల నాయకులు 21వ తేదీన విశాఖపట్నంలో జరుగునున్న యోగ దినోత్సవంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు..

## 20న శ్రీ నీలమణి దుర్గ అమ్మవారి ఆలయంలో యోగ



**పాతపట్నం జూన్ 19 ప్రజా జ్యోతి న్యూస్..** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈనెల 20న పాతపట్నం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం ఉదయం 7 గంటలకు యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నారు.ముఖ్య అతిథిగా పాతపట్నం శాసనసభ్యులు మామిడి గోవిందరావు హాజరవుతున్నారు. కావున ఆసక్తిగలవారు డ్రెస్ కోడ్ పాటించి ఈ కార్యక్రమానికి హాజరు అవ్వాలని నీలమణి దుర్గ ఆలయ కార్యనిర్వాహణాధికారి టి.వాసుదేవరావు తెలిపారు.

## యోగాధ్రా కోసం వాలంటీర్లతో సమావేశం..



**పాతపట్నం జూన్ 19 ప్రజాజ్యోతి న్యూస్** విశాఖపట్నం బీజేపీ కార్యాలయం లో గురువారం నాడు యోగాంధ్రా కార్యక్రమం లో భాగంగా వాలంటీర్ల సమావేశం లో పాల్గొన్న బీజేపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు..

## జాయింట్ పట్టాదారులు భూ విభజన కోసం జూన్ 30 వరకు అవకాశం

విభజన కోసం చెల్లించాల్సిన రూ.500 రుసుము మాఫీ



**తాళ్లపూడి, జూన్19, ప్రజాజ్యోతి న్యూస్** తూర్పు గోదావరి జిల్లాలో రీ-సర్వే పూర్తైన గ్రామాలలో వెబ్ ల్యాండ్ 2.0 లో జాయింట్ పట్టాదారులుగా నమోదు అయిన భూ యజమానులకు భూ విభజన కోసం దరఖాస్తు చేసుకునేందుకు జూన్ 30 వ తేదీ వరకు అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి గురువారం ఒక ప్రకటనలో తెలియచేసారు.జిల్లాలో రీ-సర్వే పూర్తి కాబడిన గ్రామముల యందు వెబ్ ల్యాండ్ 2.0 లో జాయింట్ పట్టాదారులుగా నమోదు కాబడిన భూ యజమానులు వారియొక్క భూములను విభజన చేయుటకు ప్రభుత్వంవారు నిర్దేశించిన 500 రూపాయల రుసుమును పూర్తిగా మినహాయించి ఉచితముగా ఈ సేవను పొందుటకు అవకాశము కల్పించడం జరిగిందన్నారు. ఇందు నిమిత్తం కేవలం నామమాత్రపు దరఖాస్తు రుసుము రూ.50 లను గ్రామ సచివాలయము నందు చెల్లించి జూన్ 30వ తేదీ లోపు దరఖాస్తుచేసుకొనవలసినదిగా తెలిపారు ఈ సదవకాశమును జాయింట్ పట్టాదారులు అందరూ ఉపయోగించుకుని జాయింట్ పట్టాలను విడివిడిగా విభజన చేయించు కోవలసినదిగా తెలియ చేయడం జరిగింది. తద్వారా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకములైన "అన్నదాత సుఖీభవ" మరియు "తల్లికి వందనం" మరియు ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకముల ప్రయోజనం పొందుటకు అర్హులుగా గుర్తించడం జరుగుతుందని తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకములో ఇబ్బంది ఉన్నవారు ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకుంటే వారికి తొలి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని వెల్లడించారు

# ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజావేదిక

ప్రజా సమస్యల పట్ల అధికారులు బాధ్యతగా వ్యవహరించాలి, ఎమ్మెల్యే

**బేతంచెర్ల: జూన్ 19(ప్రజా జ్యోతి)** డోన్ నియోజకవర్గం ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి ప్రజా సమస్యల పరిష్కర వేదిక (గ్రీవెన్స్) కార్యక్రమంలో భాగంగా బేతంచర్ల పట్టణంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో ప్రజల నుండి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా, ప్రజలు నీటి సరఫరా, రోడ్లు, పింఛన్లు, విద్యుత్, ఆరోగ్య సదుపాయాలు వంటి ప్రధాన సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి వివరించారు. ఎమ్మెల్యే ప్రతి వినతిని శ్రద్ధగా పరిశీలించి, సంబంధిత శాఖాధికారులతో సమన్వయం చేసి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రజా సంక్షేమమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొంటూ, అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు. ప్రజలు ఎప్పుడైనా తమ సమస్యలను తెలియజేయవచ్చని సూచిస్తూ, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డోన్ ఆర్డిఓ నరసింహులు , మున్సిపల్ కమిషనర్ హరిప్రసాద్ ,ఎంపీడీవో ఫజిల్ రహమాన్ తహసిల్దార్ కే.నాగమణి , డిప్యూటీ తాశీల్దార్ మారుతి, పంచాయతీరాజ్ ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీర్లు మహేష్ ,రాజశేఖర్ రెడ్డి, వివిధ శాఖ అధికారులు



సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు ఉన్నం ఎల్లా నాగయ్య , పట్టణ అధ్యక్షురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి , మాజీ ఎంపీపీ గూటుపల్లె సోమశేఖర్ రెడ్డి , టిడిపి నాయకుడు భీమేష్ రెడ్డి , పదో వార్డు కౌన్సిలర్లు రామాంజనేయులు రాంగోపాల్ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# సేవలకు సలాం











దిగ్విజయంగా పైడితలమ్మ పండుగ మహోత్సవం
అన్ని శాఖల అధికారులు సేవలు భేష్
పండుగను అత్యంత అద్భుతంగా నిర్వహించిన పండుగ కమిటీ

**పొందూరు , ప్రజా జ్యోతి న్యూస్ :** 15 ఏళ్ల తర్వాత పొందూరు తో జోగన్నపేట , లక్షిం పేట , ఎరుకుల పేట ,ఎరుకుల కాలనీ , ఆలబోయిన పేట , తాపీ మేస్త్రీ కాలనీ , కృష్ణాపురం గ్రామాల్లో నిర్వహించిన పైడితల్లి అమ్మవారి పండుగలో వివిధ శాఖలు అధికారులు తమ సేవలతో దిగ్విజయంగా పండుగను జరిపించారు. ఆమదాలవలస ఎమ్మెల్యే , రాష్ట్ర పి. యూ.సి చైర్మెన్ కూన రవికుమార్ ఆదేశాలను, సూచనలను అనుసరించి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేసి పండుగను ఎటువంటి ఆటం కాలు లేకుండా ప్రత్యేక శ్రద్ధ వహించారు. పారిశుద్ధ్య లోపాలు తలెత్తకుండా పంచాయతీ ఈ. ఓ మోహన్ బాబు , ముమ్మరంగా పంచాయతీ సిబ్బంది తో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. వీటితో పాటు విద్యుత్ లైట్లు అన్ని వీధులలో పనిచేసేలా పనులు చేయించారు. ప్రజలకు ఎటువంటి అంటువ్యాధులు ప్రబలకుండా రోడ్లపై బ్లీచింగ్ చల్లడం వంటి పనులు చేపట్టి ప్రధాన రహదారులతో పాటు అన్ని వీధులను పరిశుభ్రంగా ఉంచారు. మౌలిక సదుపాయాలలో ముఖ్యమైన విద్యుత్ పై విద్యుత్ శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి వహించారు. ఎటువంటి విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ప్రజలకు అందుబాటులో విద్యుత్ సరఫరాకు ఎటువంటి అంతరాయం కలుగకుండా చేయడం తో ప్రజలు సంతోషంగా పండుగ చేసుకున్నారు. వీటితో పాటు పలు సూచనలు అందజేసి ప్రజలకు విద్యుత్ సమస్యల పట్ల తీసుకోవల్సిన జాగ్రత్తల పట్ల అవగాహన కల్పించారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టబోయే పండుగ కావడంతో సుదేర ప్రాంతాల నుండి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడకుండా ఆమదాలవలస సి. ఐ సత్యన్నారాయణ , ఎస్. ఐ సత్యన్నారాయణ ఎక్కడిక్కడే పార్కింగ్ స్థలాలు కేటాయించి , బారిగెట్లు ఏర్పాటు చేసి ట్రాఫిక్ పై ప్రత్యేక దృష్టి సారించారు. భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడంతో ఎక్కడిక్కడే పోలీసుల పర్యవేక్షణ ఉండటంతో ఎటువంటి అసంఘటిత కార్యక్రమాలు ,అల్లర్లు జరగకుండా శాంతియుత వాతావరణం లో పండుగ జరిగింది. ఎటువంటి అనారోగ్య సమస్యలు ఏర్పడిన ,పండుగకు విచ్చేసిన వారు అస్వస్థతకు గురైన వారికి తాడివలస పి. హెచ్.సి వైద్య సిబ్బంది ఎక్కడిక్కడే వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి విరివిగా తమ సేవలను అందించారు. అధికారుల సమన్వయం ఒక ఎత్తు అయితే గ్రామంలోకి అమ్మవారిని తీసుకు వచ్చినప్పటి నాటి నుండి పండుగ కమిటీ సభ్యులు ఉత్సాహంగా పనిచేశారు. ప్రణాళిక బద్దంగా వ్యవహరించి పండుగను దిగ్విజయంగా నిర్వహించడంలో వారి చేసిన కృషి ఎనలేనిది. విరాళాల సేకరణ తో మొదలు కొని వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయడం లోనూ వివిధ శాఖల అధికారులను , ప్రజలందరినీ కలుపుకుంటూ విశేషంగా కృషి చేశారు.గ్రామ దేవత పూజారులు కూడా అమ్మవారిని గ్రామంలోకి తీసుకువచ్చిన నాటి నుండి ప్రత్యేక పూజలు నిర్వహించి ,ప్రతీ రోజూ పండుగ ముగిసే వరకు అమ్మవారి ఘటాలని వైభవంగా ఊరేగించి ప్రతీ ఒక్కరికీ అమ్మవారి దర్శనం కల్పించి పండుగను విజయవంతం చేయడంలో భాగస్వామ్యులు అయ్యారు. వీరితో పాటు మీడియా ప్రతినిధులు అమ్మవారిని విశిష్ఠతను పత్రికల్లో ప్రచురించి ,పండుగ నిర్వహణ లో చేపట్టే కార్యక్రమాలను ఎప్పటికప్పుడు ప్రజలకు తమ పత్రికల ద్వారా తెలియజేస్తూ తమ వంతు సహకారం అందజేశారు.పండుగను చరిత్రలో గుర్తుండి పోయేలా అత్యంత అద్భుతంగా నిర్వహించేలా కృషి చేసిన ఎమ్మెల్యే రవి కుమార్ కు , వివిధ శాఖల అధికారులకు , పండుగ కమిటీ సభ్యులకు ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలను మర్యాదపూర్వం కలిసిన ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్



**తాళ్లపూడి, జూన్ 19, ప్రజాజ్యోతి న్యూస్** బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు మరియు రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురంధేశ్వరి ని రాజమండ్రి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సి కమిషన్ చైర్మన్, మాజీ మంత్రి కె.ఎస్ జవహర్ పలు ప్రజా సమస్యలపై కొద్దిసేపు చర్చించుకోవడం జరిగినది ఈ కార్యక్రమంలో వేగి చిన్నా , రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షులు కొత్తపల్లి ఆశిష్ లాల్, జిల్లా తెలుగు యువత నాయకులు నామా. సురేంద్ర కుమార్, పసలపూడి బోస్,మెరిపో వెంకటరావు, ముత్యాల రాంబాబు తదితరులు ఉన్నారు

## పగడాల నరసింహ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



**బద్వేల్ జూన్ 19 (ప్రజా జ్యోతి న్యూస్)** రాహుల్ గాంధీ గారి 55వ జన్మదినోత్సవ వేడుకలను బద్వేల్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పగడాల నరసింహ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసిన అనంతరం పగడాల నరసింహ మాట్లాడుతూ పేద,బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి, కాబోయే భావి భారత ప్రధాని శ్రీ రాహుల్ గాంధీ గారు భారత్ జోడోయాత్ర ద్వారా దేశమంతా ప్రయాణించి మతసామరస్యం రాజ్యాంగ పరిరక్షణ ప్రధాన ధ్యేయంగా జోడో యాత్ర చేయడం జరిగిందని రాబోయే కాలంలో ఎస్సీ ఎస్టీ బీసీ, మైనారిటీ నాయకులకు అండగా ఉండేది ఒక కాంగ్రెస్ పార్టీ మాత్రమే అని కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకరావడానికి రాహుల్ గాంధీ గారు పెద్ద ఎత్తున కృషి చేస్తారని మాకు నమ్మకం ఉందని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో డిసిసి జనరల్ సెక్రెటరీ వై అచ్యుతరాజు, గోపవరం మండల అధ్యక్షుడు సాంబయ్య, బద్వేలు పట్టణ బీసీ నాయకులు బత్తల వెంకటేష్, శివ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు

## బాల బాలికల చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించిన ఎస్సై లక్ష్మీకాంతం



**కాకినాడ జిల్లా ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్** ప్రత్తిపాడు నియోజకవర్గం ప్రత్తిపాడు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు ప్రత్తిపాడు ఎస్సై లక్ష్మీకాంతం విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.విద్యతో పాటు విద్యార్థులు ఉన్నత విలువలు గల వ్యక్తులుగా గుర్తింపబడాలని అన్నారు. ముఖ్యంగా విద్యార్థినీ విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని తెలిపారు.విద్యార్థులకు ఫోక్సో చట్టం,సైబర్ చట్టాలు,సైబర్ నేరాలు,మిస్సింగ్ కేసులు తదితర చట్టాలపై ఎస్సై లక్ష్మీకాంతం అవగాహన కల్పించారు.ఫేస్బుక్,ఇన్స్టా, వంటి పలు వెబ్సైట్ల ద్వారా మహిళలు,యువత మోసాలకు గురవుతున్నారని అన్నారు.అపరిచిత వ్యక్తులతో సామాజిక మాధ్యమాలలో దూరంగా ఉండాలని సూచించారు.విద్యార్థి దశలో తీసుకోవలసిన జాగ్రత్తలతో పాటు ఉత్తమ విద్యను అభ్యసించి సమాజంలో మంచి పౌరులుగా మెలగాలని ఈ సందర్భంగా ఎస్సై లక్ష్మి విద్యార్థులకు తెలిపారు.ఈ పాఠశాల అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు..

## పాణ్యం సిమెంట్ ఫ్యాక్టరీ సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్తా డోన్ ఎమ్మెల్యే కోట్ల



**బేతంచెర్ల:జూన్ 19(ప్రజా జ్యోతి)** బేతంచర్ల మండలంలోని సిమెంట్ నగర్ గ్రామంలో ఉన్న పాణ్యం సిమెంట్ ఫ్యాక్టరీను తిరిగి ప్రారంభించి ఉపాధి కల్పించాలని కోరుతూ కార్మికులు గురువారం నిరసన కార్యక్రమాలు ప్రారంభించారు. బేతంచెర్ల పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద వారు ధర్నాకు దిగారు. తమకు న్యాయం చేయాలని, ఫ్యాక్టరీ తిరిగి ప్రారంభించాలని వారు కోరారు. ఈ సందర్భంలో డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి కార్మికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫ్యాక్టరీ పునఃప్రారంభానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే ఈ అంశాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధిస్తానని చెప్పారు. కార్మికుల న్యాయబద్ధమైన డిమాండ్లకు తగిన న్యాయం జరిగేలా తనవంతు పాత్రను నిర్వర్తిస్తానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

## ద్రోణాచార్య బ్యాడ్మింటన్ అకాడమీ క్రీడాకారులు హావ...



**జూన్ 19 తిరుపతి జిల్లా ప్రతినిధి (ప్రజాజ్యోతి)** తిరుపతి శివ జ్యోతి నగర్ లోని ద్రోణాచార్య బ్యాడ్మింటన్ అకాడమీ క్రీడాకారులు జిల్లా స్థాయి టోర్నమెంట్ సత్తా చాటారు. బ్యాడ్మింటన్ కోచ్ బి కృష్ణయ్య ఆధ్వర్యంలో శిక్షణ పొందిన అండర్ 13 సింగిల్స సిల్వర్ మెడల్ ఎస్ లికిత్ కృష్ణ అండర్ 13 డబుల్ పి మహిత్ రెడ్డి క్రితిక్ పథకాలు సాధించారు. బహుమతుల ప్రధాన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర సాధికార కమిటీ తెలుగుదేశం సభ్యులు జగన్నాథం పాల్గొన్నవారు. ఈ కార్యక్రమంలో రోహిత్ ,ఓంకార్, తేజస్, మహేష్ ,పెరుమాళ్, కృష్ణమూర్తి పాల్గొన్నారు

## కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా రాహుల్ గాంధీ 55 వ జన్మదిన వేడుకలు



**గుంతకల్లు జూన్ 18 (ప్రజా జ్యోతి):** పట్టణంలోని తిలక్ నగర్ లో ఉన్న కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాహుల్ గాంధీ 55వ జన్మదిన వేడుకలు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించడం జరిగింది.నాయకులు మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాలకు కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి అండగా నిలుస్తూ వారికి అభివృద్ధి బాట నడిపించడంలో కాంగ్రెస్ పార్టీ పెద్దలకు కృషి ఉంది. అదే బాటలో ఇవాళ రాహుల్ గాంధీ బడుగు బలహీన వర్గాల పట్ల... దేశ ప్రయోజనాల కోసం.... అనేక రకాలుగా ఉద్యమాలు నడుపుతూ.... కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు పాదయాత్ర చేసి ప్రజలు పడుతున్న ఇబ్బందులను కళ్లారా చూసి.... ఆవేదన చెంది... భారత దేశ ప్రజల పక్షాన నిలబడిన ప్రజా పోరాట నాయకుడు రాహుల్ గాంధీ అని ఆయన పుట్టినరోజు మరెన్నో జరుపుకోవాలని భారతదేశం ప్రధాని మంత్రిగా రాబోయే రోజుల్లో కావాలని... మతాలకు కులాలకు ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తారని భావిస్తూ... కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్న రాహుల్ గాంధీ కి మరొకసారి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయడ మైనది.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎం.మహేంద్ర,షేక్ ఆలం నవాజ్,ఫిరోజ్ ఖాన్,నబి రసూల్,ఖాదర్ వలీ,నరసన్న, రామచంద్ర,శ్రీనివాసులు,ఎస్.కే జిలాని,వలి,ఏసన్న,కిష్టప్ప, శ్రీనివాసులు,రామాంజనేయు లు తదితరులు పాల్గొన్నారు.

# మండలంలోని ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థల ఆర్థిక దోపిడీని అరికట్టాలి

**విద్యను సామాన్య మధ్యతరగతి విద్యార్థులకు అందుబాటులో ఉంచాలి**

**యూనిఫామ్, బుక్స్, షూ, టై, బెల్టు, లను స్కూల్లో విక్రయించే విద్యా సంస్థలను సీజ్ చేసి గుర్తింపు రద్దు చేయాలి**



**నంద్యాల జిల్లా : బ్యూరో జూన్ 19(ప్రజా జ్యోతి)** బేతంచర్ల లో సామాన్య మధ్యతరగతి విద్యార్థులకు విద్యను అందని ద్రాక్షగా మారుస్తున్న ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహములలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో డోన్ నియోజకవర్గ శాసనసభ్యులు గౌ.కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి గారికి వినతి పత్రం సమర్పించి అనంతరం ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్ మాట్లాడుతూ కేవలం ధనార్జనే ధ్యేయంగా విచ్చలవిడిగా అడ్మిషన్, స్కూల్ ఫీజు మేము నిర్ణయించిందే ఫీజు అని లక్షల రూపాయలను తల్లిదండ్రుల నుంచి వసూలు చేస్తున్నారని విద్య సంస్థ లో యూనిఫామ్, బుక్స్, షూ, టై, బెల్టు, విద్యాసంస్థలను అంగళ్లుగా మార్చి వ్యాపారం నిర్వహిస్తుంటే విద్యాశాఖ అధికారులు మాత్రం మామూళ్ల మత్తులో నిద్రపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు కనీస మౌలిక వసతులు, అర్హులైన ఉపాధ్యాయులు లేకుండానే నిర్వహిస్తుంటే అధికారులలో కనీస స్పందన కరువైందని ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల ఆర్థిక దోపిడిని అరికట్టి యూనిఫామ్ బుక్స్ షూ టై బెల్టు లను విక్రయించే విద్యాసంస్థలను సీజ్ చేసి గుర్తింపు రద్దు చేయాలని కోరారు అనంతరం స్పందించిన శాసనసభ్యులు ఎంఈఓ సోమశేఖర్ గారిని పిలిచి విషయం తెలుసుకొని విద్యా వ్యాపారానికి అడ్డుకట్ట వెయ్యాలని ఆదేశించారు పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో మండల ఏఐఎస్ఎఫ్ ఏఐవైఎఫ్ నాయకులు ఎల్లకృష్ణ,మధు, విజయ్, సమీర్, ఖదీర్ తిరుపాలు, మున్నా, మధుకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా రాష్ట్రీయ బాల స్వస్త్యా కార్యక్రమం.





**(ప్రజా జ్యోతి రిపోర్టర్ ) 19-06-2025,** వెల్దుర్తి మండల పరిధిలో రామాళ్లకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సచివాలయంలో జరుగుచున్న సంచార చికిత్స కార్యక్రమన్ని జిల్లా రాష్ట్రీయ బాల స్వస్త్యా కార్యక్రమం అధికారి డాక్టర్. మహేశ్వర్ ప్రసాద్ గారు తనిఖీ చేశారు, అనంతరం మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలాలో ఫ్లోరోసిస్ వలన కలిగే సమస్యలపై అవగాహన కల్పించారు .సాధరణంగా ఫ్లోరైడ్ నీటిని త్రాగడం వలన దంతాలు పసుపు, గోధుమ రంగులోకి మారడము,కిడ్నీ సంబంధిత వ్యాధులు ,ఎముకలు గుండ్రంగా వంగిపోయి కీళ్ళు నొప్పి రావడము,కండరాల బలహీనత పడడము, ప్రేగు గోడలు దెబ్బతిని పోషకలు మరియు ఖనిజా లవణాలు శోషణ జరగక రక్తహీనతకు గురి అయ్యే అవకాశము, దప్పిక తీరకపోవడం పిల్లల పెరుగుదలపై ప్రభావము చూపుతుందన్నారు. బీడీ ,చుట్ట,పాన్, పాన్ మసాలా వంటివి ఉపయోగించడం వలన ఫ్లోరోసిస్ సంబంధిత ఆరోగ్య సమస్యలు వస్తాయని తెలిపారు.,మల్టివిటమిన్, ఐరన్, జింక్, క్యాల్షియం, విటమిన్ ఉన్న ఆహారాన్ని తీసుకోవాలని , ,అనంతరం బాధితులకు ఉచితంగా మల్టీ విటమిన్ ,విటమిన్ మాత్రలను అందించినారు. ఈ కార్యక్రమములో వైద్యులు డాక్టర్ .భువనతేజ గారు, ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ సుధాకర్, హెడ్ మాస్టర్ పద్మావతి,సామజిక ఆరోగ్య అధికారి ఈశ్వరి, ఆరోగ్య కార్యకర్త మద్దమ్మ గారు,ఆశా కార్యకర్తలు మరియు ప్రొజెక్షనిస్ట్ ఖలీల్ పాల్గొన్నారు.

## టిడిపి నాయకులు పంచాయతీ సెక్రెటరీ సన్మాన కార్యక్రమం



**(ప్రజా జ్యోతి రిపోర్టర్ ) 19-06-2025.** వెల్దుర్తి మండలం పుల్లగుమ్మి పంచాయతీ సెక్రటరీగా విధులు నిర్వహిస్తూ ఇటీవల గ్రేడ్ 3 నుంచి గ్రేడ్ 2 పంచాయతీ సెక్రెటరీగా ప్రమోషన్ మీద కడప జిల్లా ఖాజీపేట మండలం పుల్లూరు గ్రామపంచాయతీ సెక్రటరీగా వెళు _న్న పంచాయతీ కార్యదర్శి శ్రీ రహమాత్ భాషా గారిని పుల్లగుమ్మి గ్రామ టిడిపి నాయకులు శ్రీ వెంకటేశ్వర్ రెడ్డి గారు,, సర్పంచ్ గారు గోరంట్ల వెంకటేశ్వరమ్మ గారు,, వెంకటేశ్వర్లు గారు మరియు సచివాల సిబ్బంది అందరూ ఘనంగా సన్మానించడం జరిగింది

## చారిత్రక నాటక పితామహుడు

ఆంధ్ర నాటక రంగానికి ఆధునిక తను ప్రసాదించిన వారిలో ఎన్నదగిన వారు కోలాచలం శ్రీనివాసరావు, ధర్మవరం రామ కృష్ణమా చార్యులు. ఆధునిక ఆంధ్ర నాటక రంగానికి విశిష్ట సేవలు అందించిన ఈ ఇరువురు బళ్ళారికి చెందిన వారే కావడం విశేషం. కోలాచలం శ్రీనివాసరావు (మార్చి 13, 1854 – జూన్ 20, 1919) ప్రముఖ న్యాయవాది. నాటక కర్త, నాటక శాల నిర్మాత, కవి, పరిశోధ కులు, బహు భాషా వేత్త, సంఘ సంస్కర్త, తెలుగు సాహిత్య సేవకులు. కోలాచలం శ్రీనివాసరావు తెలుగు నాట సాహిత్యానికి, తెలుగు నాటక రంగానికి చేసిన సేవ అనన్య సామాన్యం. అనితర సాధ్యం. తెలుగు నాటక కర్తలలో ఉత్తమ శ్రేణి నాటక కర్తగా ప్రసిద్ధులు, నాటక రచనా ప్రయోగాల్లో విజయం సాధించిన వారు. సంఘంలోని దురాచారాలను నిర్మూలించి సంఘ సంస్కరణం చేయడం, వినోదంతో పాటు ప్రజలకు నీతిని బోధించడం, హాస్యం సమ్మిళితం చేసి ప్రేక్షకుల హృదయాలను చూరగొనడం, వీటికి తోడు ప్రధానంగా ప్రజలకు చారిత్రక నాటకాల ప్రదర్శనవల్ల చరిత్ర తెలియ చేయాలన్నది ఆయన లక్ష్యాలు. చారిత్రక రచనలు, సంఘానికి సంబంధించిన రచనలు సమాజానికి అత్యవ సరమని భావించి ఆ దిశగా కృషి చేశారు. అందుకే ఆయన చారిత్రక నాటక పితా మహునిగా పేరెన్నిక గన్నారు. తెలుగు నాటక రంగ అభ్యుదయ, వికాసాలకు తమ జీవితాన్ని అంకితం చేసిన కోలాచలం

# యోగాతో ఆరోగ్యం మానసిక దారుఢ్యం






**యోగాలో పాల్గొన్న జిల్లా కలెక్టర్**

**చీరాల ఎమ్మెల్యే**

**బాపట్ల జూన్ 19 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి మాట్లాడుతూ, యోగా వలన శరీర ఆరోగ్యం, మానసిక సమతుల్యత మెరుగవుతుందని తెలిపారు. చీరాల వాడరేవు రోడ్డులోని నగలవనంలో గురువారం నిర్వహించిన యోగా అవగాహన కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు చీరాల శాసనసభ్యులు ఎం. మాలకొండయ్య పాల్గొన్నారు.జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రపంచం మొత్తం జరుపుకుంటుందని కలెక్టర్ తెలిపారు. ఈ దినోత్సవాన్ని ఐక్యరాజ్యసమితిలో భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రతిపాదించగా, 2014 నుండి 172 దేశాల్లో జరుపుకుంటున్నట్టు వివరించారు.ఈ ఏడాది విశాఖ ఆర్కే బీచ్ నుండి శ్రీకాకుళం వరకు 5 లక్షల మందితో యోగా కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని పేర్కొన్నారు. మే 21 నుండి జూన్ 21 వరకు యోగా వారోత్సవాలు నిర్వహించబడుతున్నాయని, బాపట్ల జిల్లాలో రామాపురం, సూర్యలంక బీచ్‌లలో 10 వేల మందితో ప్రత్యేక యోగా కార్యక్రమాలు జరుగనున్నాయని వెల్లడించారు.ఎమ్మెల్యే ఎం. మాలకొండయ్య మాట్లాడుతూ, యోగా అనేది శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి చిత్తశుద్ధితో ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని యోగా ఉద్యమాన్ని చేపట్టారని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ స్థాయికి చేర్చడం ద్వారా ప్రజల్లో మార్పులు తీసుకురావచ్చని అన్నారు. ప్రతి ఒక్కరూ యోగాను దినచర్యగా అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్, ఆయుష్ అధికారి డాక్టర్ శ్రీనివాసరావు, వైద్యాధికారి డాక్టర్ విజయమ్మ, ఎన్‌సీసీ విద్యార్థులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# లిఒమ్మంగి గ్రామంలో మురళిరాజు గారు పర్యటన



**కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ప్రజా జ్యోతి రిపోర్టర్. వీరబాబు** లిఒమ్మంగి గ్రామంలో బత్తిన వారి నిరుపేద కుటుంబాన్ని పరామర్శించిన మురళీ రాజు ప్రత్తిపాడు మండలం, ఒమ్మంగి గ్రామానికి చెందిన బత్తిన రాంబాబు స్వర్గస్తులైనారు.. వారి కుటుంబాన్ని పరామర్శించి, ఆ నిరుపేద కుటుంబానికి 5000 వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేసి, ఆ కుటుంబానికి అండగా ఉంటానని ధైర్యం చెప్పిన లిప్రత్తిపాడు నియోజకవర్గ వైయస్సార్ సిపి నాయకులు నరసాపురం పార్లమెంటరీ పరిశీలకులు ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శ్రీ ముదునూరి మురళీకృష్ణం రాజు ఈ కార్యక్రమంలో గంటా గంగ బాబు , ముమ్మిడి వీరబాబు , తోలేటి శేఖర్ నార్లంక వెంకన్న బాబు గమిత్తన వీరబాబు గంటా చిట్టిబాబు , గంటా బుజ్జి సుంకర తమ్మారావు , దారా నూకరాజు , శైలు నాగేశ్వరరావు షేక్ సత్తిబాబు , చుక్కా రమణ దేవరపు రాంబాబు అర్జంపూడి రాంబాబు , ముమ్మిడి రాంబాబు గారు, మాదే రాంబాబు మట్ల అనిల్ సుంకర రాంబాబు మిత్తన వీరబాబు గంటా దుర్గ బాబు సూరారి వీరబాబు చెవల వెంకన్న , కందా కృష్ణ అరటా పండు , కోలా తాతబాబు యాళ్ల యేసు ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ ను సాధించిన విద్యార్థిని అభినందించిన ఎస్సీ కమిషన్ చైర్మన్ కెఎస్ జవహర్



**తాళ్లపూడి, జూన్19, ప్రజాజ్యోతి న్యూస్** ఇటీవల గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ లో స్థానం సంపాదించుకున్న బుల్లా డోలా కృష్ణను అభినందించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సి కమిషన్ కె.ఎస్ జవహర్ ఆశీర్వాదం కోరి కొవ్వూరు పట్టణం లోని కార్యాలయానికి వచ్చిన కొవ్వూరు పట్టణానికి చెందిన విద్యార్థి తల్లిదండ్రులు. ఈ సందర్భంగా జవహర్ డోలా కృష్ణకు ఆయన ఆశీస్సులు అభినందనలు అందజేస్తూ అతి చిన్న వయస్సులో ఈ స్థానం సంపాదించుకోవటం ఎంతో గర్వ కారణమని, తల్లిదండ్రుల కృషి విద్యార్థి జ్ఞాపక శక్తి ఎంతో అభినందనీయమని అన్నారు. రాబోయే తరాలకు ఇలాంటి వారు స్ఫూర్తిగా నిలవాలని జవహర్ తెలిపారు

## రైతులకు భరోసా

**చివరి ఆకు వరకు కొనుగోలు మంత్రి అచ్చంనాయుడు**



**బాపట్ల జూన్ 19 (ప్రజాజ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** పర్చూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో నల్ల బర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి కింజారపు అచ్చంనాయుడు గురువారం ప్రారంభించారు. మొదటిసారిగా ప్రభుత్వం ఈ రకపు పొగాకును మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తుండటం చారిత్రాత్మకమని పేర్కొన్నారు. హెచ్‌డీఆర్, హెచ్‌డీఎం రకాలకు క్వింటా 12,000, వేల రూపాయలు హెచ్‌డీఎక్స్ రకానికి 6,000 వేల ధరగా నిర్ణయించారని తెలిపారు. రైతులు నాణ్యత ప్రమాణాలు పాటించాలనీ, ప్రభుత్వ నిబంధనల మేరకు మాత్రమే కొనుగోలు జరుగుతుందని మంత్రి వివరించారు.రైతులు మోసపోవద్దని, కంపెనీల మాటలు నమ్మకుండా లిఖితపూర్వక ఒప్పందాలు ఉంటేనే పొగాకు సాగు చేయాలని సూచించారు. పంటలకు మార్కెట్లో డిమాండ్, వాతావరణాన్ని బట్టి ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలని మంత్రి అచ్చం నాయుడు సూచించారు. పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూ,చివరి రైతుకు న్యాయం జరిగేలా కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని చెప్పారు బ్లాక్ బర్లీ సాగు చేయమన్న కంపెనీలు ఇప్పుడు చేతులు పైకెత్తినా, రైతుల కోసం ప్రభుత్వం ముందుకొచ్చింది. నోటిమాట నమ్మి మోసపోకుండా ప్రభుత్వం చెప్పినదానిని పాటించాలని తెలియజేశారు వ్యవసాయ శాఖ ప్రత్యేక కార్యదర్శి బి రాజశేఖర్ మాట్లాడుతూ 20 మిలియన్ కేజీల కొనుగోలు కోసం ముఖ్యమంత్రి నిధులు మంజూరు చేశారని చెప్పారు. జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి మాట్లాడుతూ రైతులు దారుణమైన పరిస్థితుల్లో చిక్కుకోకుండా ఉంచేందుకే ఈ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. రైతుల ఉత్పత్తుల వివరాలు సీఎం యాప్ ద్వారా నమోదు చేయనున్నారని చెప్పారు. ప్రభుత్వం సూచించిన తేదీల్లోనే గోదాములకు తీసుకురావాలని సూచించారు .ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీ రావు, వేర్‌హౌసింగ్ డైరెక్టర్ సురేష్ కుమార్, మార్క్‌ఫెడ్ ఎండి మంజీర్ జిలాని సమాన్, ఇతర అధికారులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## పార్టీ ఎవరిని ఏ పదవిలో నియమించిన పార్టీకి అహర్నిశలు కృషి చేయాలి

**ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం**




**గుంతకల్లు జూన్ 19 (ప్రజా జ్యోతి):** తెలుగుదేశం పార్టీ ఎవరిని ఏ పదవిలో నియమించిన పార్టీకి అహర్నిశలు కృషి చేయాలని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పార్టీ నాయకులకు కార్యకర్తలకు తెలిపారు. గురువారం పట్టణంలోని పరిటాల శ్రీరాములు కల్యాణమండపం నందు గుంతకల్లు నియోజకవర్గం శాసన సభ్యులు గుమ్మనూరు జయరాం మరియు ఆయన సోదరుడు గుమ్మనూరు నారాయణ స్వామి అధ్యక్షతన గుంతకల్లు నియోజకవర్గం రెగ్యులర్ అబ్జర్వర్ తిమ్మయ్య చౌదరి,గుంతకల్లు నియోజకవర్గం ఎలక్షన్ అబ్జర్వర్ టి.తులసిరెడ్డి, గుంతకల్లు నియోజకవర్గం ఎలక్షన్ అబ్జర్వర్ పర్వీన్ భాను,గుంతకల్లు నియోజకవర్గం రూరల్ అబ్జర్వర్ పర్వాతనేని శ్రీధర్ బాబు మరియు గుంతకల్లు టౌన్ అబ్జర్వర్ ఆవుల కృష్ణయ్య మరియు కేసీ హరి సమక్షంలో గుంతకల్లు పట్టణ మరియు మండల సంస్థగత కమిటీ నిర్మాణం మరియు ఎన్నిక కార్యక్రమం నిర్వహించ డం జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం టౌన్ మరియు మండల అధ్యక్ష పదవుల ఆశవహుళ నుండి అర్జీలను స్వీకరించారు.ఈసందర్భంగా గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పని చేసిన నాయకులు పార్టీ పదవి ఆశించడంలో తప్పు లేదు పార్టీ ఎవరిని ఆదేశిస్తే వారికి పదవులు వరిస్తాయని ఎవరికి అధ్యక్షులు గా పదవి వచ్చిన పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి పని చేసి పార్టీ ని మరింత బలోపేతం చేయాలని అన్నారు.పదవులు అనేవి అలంకారం కోసం కాదని పార్టీ ఒక పదవి ఇచ్చిందంటే ఆ వ్యక్తి పార్టీ లో అందరినీ కలుపుకొని పోవాలని గుమ్మనూరు జయరాం సూచించారు. ఇప్పుడు మీరు ఇచ్చిన అర్జీలను అన్ని పార్టీ కేంద్ర కార్యాలయం కి పంపడం జరుగుతుంది అని ఫలితాలు మరో నాలుగు రోజుల్లో వస్తాయని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమం లో గుంతకల్లు పట్టణం మరియు మండల టీడీపీ నాయకులు మరియు కార్యకర్తలు అన్ని అనుబంధ సంఘాల నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.